www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 1 | సంచిక: 308 | శని వారం, 4 ఏప్రిల్, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 1 | ISSUE : 308 | SATURDAY, APRIL 4, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## ఏఐ సునామీ వచ్చేస్తోంది

- ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధం కావాలి.. వైట్ కాలర్‌కు బదులు బ్లూకాలర్ ఉద్యోగాలు పెంచాలి
- విద్యావిధానంలో సంస్కరణలు అవసరం
- సర్కారీ విద్య వైఫల్యంపై ఆలోచించాలి
- ఒక్కో విద్యార్థికి రూ.1.08 లక్షలు ఖర్చు
- రాష్ట్రంలో 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి
- ఏవీఎన్ లేక్‌ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ ప్రారంభం

2 లో..



## కన్న తండ్రే కాలయముడు

- కవల పిల్లలను బావిలో తోసేసిన తండ్రి
- దంపతుల మధ్య విభేదాలే కారణం?
- కరీంనగర్‌లో దారుణం..

2 లో..




2 లో..

## 6వ తరగతి నుంచి త్రిభాషా విధానం


- సీబీఎస్ఈ కీలక నిర్ణయం
- తొమ్మిదో తరగతికి గణితం, సైన్స్‌లో రెండు స్థాయిలు
- 2026-27 విద్యా సంవత్సరం నుంచి సిలబస్‌లో అమలు



## విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో తేడాలు

2 లో..

- ఎన్నికలకు ముందే ఒక నియోజకవర్గాన్ని కోల్పోయే ప్రమాదం
- అలాగే బ్యాంక్ ఖాతాలకు సంబంధించి ఇచ్చిన సమాచారం వేర్వేరుగా



2 లో..

## ఢిల్లీలో భూకంపం..

- ప్రాణ భయంతో పరుగులు తీసిన జనం..!
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌తో పాటు ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో ప్రకంపనలు




## రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు

- కేరళం సీఎం పినరయి విజయన్
- ఇటీవల కేరళంలో ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలకు ఘాటు స్పందన

**తిరువనంతపురం:** కేరళంలో ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేరళం సీఎం పినరయి విజయన్ ఘాటుగా స్పందించారు. తన పై, కేరళం అభివృద్ధి నమూనాపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవగాహన లేనివని, మిగతా 2లో..





## పశ్చిమాసియాలో యుద్ధం

# మరింత ఉధృతం

- తీవ్రస్థాయిలో దాడులు.. మౌలిక సదుపాయాల విధ్వంసం
- ఇరాన్‌లోని ఎత్తయిన వంతెనను పేల్చేసిన అమెరికా
- 8 మంది మృతి.. 95 మందికి గాయాలు
- కువైట్ చమురు రిఫైనరీపై దాడి..
- అబుధాబిలో క్షిపణి శకలాలు పడి ఐదుగురు భారతీయులకు గాయాలు
- మరో ఎఫ్-35ను కూల్చేశామన్న ఐఆర్‌జీసీ
- గాలింపు చేపట్టిన అమెరికా హెలికాప్టర్‌ను కూడా..!
- పైలట్లను ప్రాణాలతో పట్టిస్తే భారీ బహుమతి అంటూ ఇరాన్ స్థానిక అధికారుల ప్రకటన
- ఇక చర్చలు ఉండవు: ఇరాన్ విదేశాంగ మంత్రి
- హోర్ముజ్‌ను తెరిచి, చమురు స్వాధీనం చేసుకోగలం: ట్రంప్

**పశ్చిమాసియా యుద్ధం మరింత** ఉధృతమైంది. ఇరాన్ ఉగ్రరూపం దాల్చింది. శత్రుదేశాలపై శనివారం భీకరదాడులకు దిగింది. అమెరికాకు చెందిన ఎఫ్15ఈ ఫైటర్ జెట్‌ను నేలకూల్చింది. దీంతో యుద్ధ విమానంలోని ఇద్దరు పైలట్లు కిందకు దూకేశారు. వీరిలో ఒకరిని అమెరికా రక్షించినట్టు ఇజ్రాయెల్ మీడియా కథనాలు తెలిపాయి. మరొకరి కోసం గాలిస్తున్నట్టు పేర్కొన్నాయి. అయితే పైలట్ల రెస్క్యూ కోసం వచ్చిన అమెరికా జెట్‌ను కూడా కూల్చివేసినట్టు ఇరాన్ ప్రకటించింది. పైలట్లను పట్టుకున్న వారికి భారీ రివార్డు అందిస్తామని ఆఫర్ ఇచ్చింది. మరోవైపు, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు ముమ్మరం చేసింది. కువైట్‌లోని ఆయిల్ రిఫైనరీ, డీశాలినేషన్ ప్లాంట్ (ఉప్పు నీటి శుద్ధి కేంద్రం)పై దాడులు చేసింది. దుబాయ్‌లోని ఒరాకిల్ డాటా సెంటర్‌పైనా విరుచుకుపడింది. ఇజ్రాయెల్‌లోని మొస్సాద్ హెడ్‌క్వార్టర్స్‌పై క్షిపణులతో దాడి చేసింది.



**దుబాయ్/వాషింగ్టన్:** పశ్చిమాసియాలో యుద్ధం మరింత ఉధృతం అవుతోంది. పౌర మౌలిక సదుపాయాలపైనా దాడులు జరుగుతున్నాయి. ఇరాన్‌లో వంతెనను అమెరికా పేల్చివేస్తే.. గల్ఫ్ దేశాల్లోని చమురు, విద్యుత్ ప్లాంట్లు, డీసాలినేషన్ వ్యవస్థలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. అటు అమెరికా యుద్ధ విమానాన్నీ కూల్చివేసింది. దాడులు చేయబోమంటూనే అమెరికా మోసానికి పాల్పడిందని ఇరాన్ ఆరోపిస్తే... ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ ప్లాంట్లు ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌లోని టెహ్రాన్ నుంచి కరాజ్ ప్రాంతాన్ని కలిపే భారీ వంతెన 'బీ1 బ్రిడ్జ్'ను అమెరికా శుక్రవారం పేల్చివేసింది. ఆ పేలుళ్ల వీడియో ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మిగతా 2లో..



## దక్షిణాసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా తెలంగాణ

- పత్తి ఉత్పత్తిలో అగ్రగామిగా రాష్ట్రం..
- మన పత్తికి అంతర్జాతీయంగా పేరు
- రాష్ట్రానికి ప్రధాన బలంగా నిలిచిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్
- గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లు అభివృద్ధి చేస్తాం
- హైటెక్స్‌లో అటెక్సకాన్-2026 సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రసంగం

### 2047 నాటికి తీర్చిదిద్దాలన్నది లక్ష్యం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 3:



తెలంగాణను 2047 నాటికి దక్షిణాసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం ఆ రంగంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు భూమి, విద్యుత్, నీరు, తదితర మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకాలు కల్పించడంతోపాటు వేగవంతమైన అనుమతులు మంజూరు చేస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో మిగతా 2లో..



## బీఆర్ఎస్ గూటికి జీవన్‌రెడ్డి!

- ఈనెలలోనే కారెక్కే అవకాశం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 3:

ఇటీవల కాంగ్రెస్‌కు వీడ్కోలు చెప్పిన ఆ పార్టీ సీనియర్ నేత టి. జీవన్‌రెడ్డి త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. స్పష్టమైన తేదీని ప్రకటించనప్పటికీ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 8న విదేశీ పర్యటనను ముగించుకొని వచ్చిన తర్వాత ఆయనతో జీవన్‌రెడ్డి భేటీ అవుతారని తెలుస్తోంది. కారెక్కేందుకు ఆయన సిద్ధంగా ఉన్నప్పటికీ.. కేటీఆర్‌తో భేటీ తర్వాతే ఈ అంశంపై ఆయన స్పష్టతనిస్తారని సమాచారం. కుదిరితే ఈనెల రెండో వారం లేదంటే, బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవమైన 27వ తేదీన జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరతారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.



## పార్టీకి పాత పేరు.. కొత్త అజెండా!

- టీఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది.. ఎవరైనా వాడుకోవచ్చు
- ప్రొ. జయశంకర్ సిద్ధాంతాల ప్రకారం పని చేస్తాం
- పార్టీ ఆవిర్భావం తర్వాత భారీగా చేరికలుంటాయి
- సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలు మహిళలకు రిజర్వు అయితే వాటిలో ఒక దాన్నుంచి పోటీ చేస్తా
- నిద్రావస్థలో బీఆర్ఎస్.. ప్రథమ శత్రువు కాంగ్రెస్సే
- ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని ప్రభుత్వం అడ్డుకోవటం లేదు
- ప్రైవేటు టీచర్ల హక్కుల కోసం పోరాడుతాం
- జాగృతి అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్, (వార్త వేదిక సూర)-ఏప్రిల్ 3:

తాను స్థాపించనున్న పార్టీకి పాత పేరు, కొత్త అజెండా ఉంటుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఖాళీగా ఉందని.. దాన్ని ఎవరైనా వాడుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఒక టీమ్ పని చేస్తోందని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో మీడియాతో కవిత ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త ఎవరూ లేరంటూ.. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో ఒప్పందాలు చేసుకునే పార్టీలపై పరోక్షంగా చెణుకులు విసిరారు. ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల ప్రకారం తమ పార్టీ నడుస్తుందన్నారు. ఆవిర్భావ సభకు ఇతర పార్టీల నేతలను ఆహ్వానించడం లేదని, మిగతా 2లో..

# పశ్చిమాసియాలో యుద్ధం మరింత ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. ఇంకా ఆలస్యం కాకముందే ఇరాన్ ఒప్పందా నికి రావడం మంచిదని హెచ్చరించారు. నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్న ఈ వంతెన పశ్చిమాసియాలోనే ఎత్తయినదిగా చెబుతున్నారు. 446 అడుగుల (136 మీటర్ల) ఎత్తయిన ఈ వంతెనపై తొలుత వైమానిక దాడి చేసిన అమెరికా.. సహాయక చర్యలు కొనసాగుతున్న సమయంలో రెండో సారి బాంబులు వేసింది. ఆ సమయంలో వంతెనకు సమీపంలో పర్షియన్ కొత్త సంవత్సరం 'నౌరుజ్' వేడుకల ముగింపు కార్యక్రమం జరుగుతోంది. వందలాది మంది గుమిగూడి ఉన్నారు. దాడిలో వారిలో 8 మంది మృతిచెందగా.. 95 మందికిపైగా గాయపడినట్టు ఇరాన్ వెల్లడించింది. బ్రిడ్జి పేల్చివేత ఘటనపై తీవ్రస్థాయిలో మండిపడింది. దీనికి ప్రతీకారంగా పశ్చిమాసియాలోని ఎనిమిది భారీ, కీలక వంతెనలను పేల్చివేస్తామని ప్రకటించింది. కువైట్‌లోని షేక్ జబేర్ సీబ్రిడ్జి, యూఏఈలోని అల్ మఖ్తా, షేక్ ఖలీఫా, షేక్ జాయెద్ వంతెనలు, బహ్రెయిన్-సౌదీలను కలిపే కింగ్ ఫాహద్ కాజ్‌వే, జోర్డాన్‌లోని కింగ్ హుస్సేన్, దమియా, అబ్దౌన్ వంతెనలను కూల్చివేస్తామని హెచ్చరించింది.

### మరో ఎఫ్-35ను కూల్చేసిన ఇరాన్!

అమెరికాకు చెందిన మరో అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం ఎఫ్-35 లైట్నింగ్-2ను కూల్చివేసినట్టు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. గత 24 గంటల్లో ఇది రెండోదని, మొత్తంగా మూడో ఎఫ్-35ని అమెరికా నష్టపోయిందని పేర్కొంది. శుక్రవారం సెంట్రల్ ఇరాన్‌లోని కోహ్గిలుయే ప్రాంతంలో ఈ ఫైటర్ కూలిపోయి, భారీ పేలుళ్లు జరిగాయని తెలిపింది. అయితే అందులోని పైలట్లు ముందే ఎజెక్ట్ వ్యవస్థ ద్వారా బయటపడి నేలపై దిగారని.. వారి కోసం అమెరికా హెలికాప్టర్లు, సీ-130 హెర్క్యులస్ విమానాలు తక్కువ ఎత్తులో ఎగురుతూ గాలింపు చేపట్టాయని వెల్లడించింది. గాలింపు వీడియోలను కూడా విడుదల చేసింది. ఆ అమెరికన్ పైలట్‌ను ప్రాణాలతో పట్టిస్తే 'విలువైన బహుమతి' ఇస్తామని ఇరాన్ సైనికాధికారులు ప్రకటించారు. అయితే సదరు పైలట్లను ఇప్పటికే ఇరాన్ సైన్యం పట్టుకుందనే వార్తలూ వెలువడుతున్నాయి. ఇరాన్‌లో ఒక యుద్ధ విమానం కూలిపోయిందని, రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని అమెరికా రక్షణ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించినట్టుగా వాల్‌స్ట్రీట్ జర్నల్, సీఎన్ఎన్ తెలిపాయి. ఒక పైలట్‌ను గుర్తించి రక్షించారని వెల్లడించాయి. కూలిపోయినది ఎఫ్-15ఈ ఫైటర్ అయి ఉంటుందని.. ఎందుకంటే ఎఫ్-35లో ఒకరే పైలట్ ఉంటారని, ఎఫ్-15ఈలో ఇద్దరు పైలట్లు ఉంటారని విశ్లేషించాయి. కూలిపోయిన యుద్ధ విమానం శకలాలను, పైలట్లను గుర్తించేందుకు అమెరికా బ్లాక్ హాక్ హెలికాప్టర్, సీ-130 హెర్క్యులస్ విమానాలతో గాలింపు చేపట్టింది. ఈ క్రమంలో వాటిపైనా ఇరాన్ డ్రోన్లు, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడిలో ఒక హెలికాప్టర్ కూలిపోయిందని ఇరాన్ మెహర్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది.

### కువైట్‌లో ఆయిల్ రిఫైనరీ ధ్వంసం

గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తూ ఉంది. కువైట్‌లోని రిఫైనరీపై భీకర దాడులు చేసింది. మినా అల్ అహ్మదీ రిఫైనరీపై శుక్రవారం ఉదయయే ఇరాన్ డ్రోన్ల ద్వారా దాడులు జరిపి ధ్వంసం చేసింది. దీంతో రిఫైనరీలోని మూడు యూనిట్లు మంటల్లో చిక్కుకున్నాయి. ఈ దాడిలో ఎవరూ గాయపడ లేదని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రిఫైనరీపై దాడి జరగడం మూడోసారని అల్ జజీరా మీడియా తెలిపింది. అలాగే కువైట్‌లోని డీశాలినేషన్ ప్లాంట్‌పై కూడా ఇరాన్ దాడులు జరిపింది. ఈ దాడి ఎక్కడ జరిగిందీ వివరాలు తెలియరాలేదు. అయితే తాము ఈ దాడి చేయలేదని ఐఆర్‌జీసీ స్పష్టం చేస్తూ, దీనికి ఇజ్రాయెలే కారణమని ఆరోపించింది. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సంస్థ మొస్సాద్ హెడ్‌క్వార్టర్స్‌పై కచ్చితమైన దాడి నిర్వహించినట్టు ఇరాన్ మిలిటరీ ప్రకటించింది. తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ దాడిలో మొసాద్ ప్రధాన కార్యాలయం పూర్తిగా ధ్వంసమైంది. అయితే దీనిని ఇజ్రాయెల్ అధికారికంగా ధ్రువీకరించ లేదు. ఇరాన్ దాడుల క్రమంలో తమ హబ్షాన్ గ్యాస్ సౌకర్యాలను నిలిపివేసినట్టు అబుదాబి ప్రకటించింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడ లేదని తెలిపింది.

### ఒరాకిల్ డాటా సెంటర్‌పై దాడి

ఒక వైపు 30 వేల మందికి ఉద్వాసన పలికి టెక్ సంస్థ ఒరాకిల్ ప్రకంపనలు సృష్టించగా, దానిపై దాడి చేసి ఇరాన్ సంచలనం సృష్టించింది. దుబాయ్‌లోని ఒరాకిల్, బహ్రెయిన్‌లోని అమెజాన్ సంస్థల డాటా సెంటర్లపై ఐఆర్‌జీసీ దాడులు చేసినట్టు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఈ వార్తలను యూఎస్ అధికారులు ఖండించగా, బహ్రెయిన్‌లోని అమెజాన్ డాటా సెంటర్లపై దాడిని అమెజాన్ నిర్ధారించింది.

### అబుదాబిలో ఐదుగురు భారతీయులకు గాయాలు

క్షిపణి శకలాలు పడి అబుదాబిలో శుక్రవారం ఐదుగురు భారతీయులు గాయపడ్డారు. శత్రు దేశ ఆయుధాలను అడ్డుకునే క్రమంలో అజ్బాన్‌లో శకలాలు పడి పలువురు గాయపడ్డారని, అందులో ఐదుగురు భారతీయులకు స్వల్పంగా గాయాలైనట్టు సమాచారం.

# దక్షిణాసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ - 2026 (అటెక్సకాన్)లో ఆయన కీలక ప్రసంగం చేశారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన టెక్స్‌టైల్ రంగ ప్రతినిధులకు తెలంగాణ, హైదరాబాద్ తరఫున ఆయన స్వాగతం పలికారు. ఈ సదస్సులో పాల్గొంటున్నవారు కేవలం అతిథులు మాత్రమే కాదని, తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు, రాష్ట్ర విజన్‌ను పంచుకునే స్నేహితులని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు తెలంగాణ బలం అని అన్నారు. పత్తి పొలాల నుంచి లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ వేదికల వరకు తెలంగాణ రాష్ట్రం తనదైన ముద్ర వేసిందన్నారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాల తయారీలో గొప్ప చరిత్ర ఉందని, శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్ రంగాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దాయని చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి పవిత్ర వస్త్రాలను సమర్పించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు.

నిజాం కాలం నుంచే..

వస్త్రకళ అనేది తెలంగాణ డీఎన్ఏలోనే ఉందని సీఎం రేవంత్ అన్నారు. నిజాం కాలం నుంచే ప్రపంచ వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారని గుర్తుచేశారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వంటి సంప్రదాయ వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. పత్తి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోందని, ఇక్కడ పండే పత్తి నాణ్యతకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి పేరుందని తెలిపారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ రాష్ట్రానికి ప్రధాన బలంగా నిలుస్తోందన్నారు. హైదరాబాద్ గ్లోబల్ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, సినిమా రంగం, వారి ఫ్యాషన్‌ను కూడా తెలంగాణ టెక్స్‌టైల్ నుంచే పొందేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. యువతకు, ముఖ్యంగా మహిళలకు శిక్షణ ఇచ్చి, వారిలో సంప్రదాయం-ఆధునికత కలగలిపిన నైపుణ్యాలను పెంపొందిస్తామన్నారు. రానున్న రోజుల్లో ప్రపంచంలోని ప్రతి దేశంలో తెలంగాణలో తయారైన దుస్తులే ధరించేలా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తమ దృష్టిలో 'టెక్స్‌టైల్' అంటే కేవలం వ్యాపారం మాత్రమే కాదని, అట్టడుగున ఉన్న నేతన్నకు అందించే 'సామాజిక న్యాయం' అని అభివర్ణించారు. తెలంగాణలో టెక్స్‌టైల్ రంగం కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదని, వేలాది కుటుంబాల జీవనాధారమని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు.

తమ్మిడికుంట పనులు పరిశీలించిన సీఎం

ఐటీ కారిడార్‌లోని తమ్మిడికుంట చెరువు అభివృద్ధి పనులను సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం హైటెక్స్‌లో జరుగుతోన్న టెక్స్‌టైల్ సదస్సులో పాల్గొన్న అనంతరం తిరిగి వెళ్తున్న సమయంలో కాన్వాయ్‌ని ఆకస్మికంగా చెరువు వైపు మళ్లించారు. చెరువు చుట్టూ తిరిగి.. పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. హైటెక్స్‌లో ఉన్న తమ్మిడికుంట చెరువు.. కబ్జాలతో 14 ఎకరాలకు కుచించుకుపోయింది. ప్రముఖ సినీనటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్.. కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉందని గుర్తించి రెండెకరాల మేర హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే. అనంతరం నాగార్జున ఆ స్థలాన్ని అభివృద్ధి కోసం ప్రభుత్వానికి అప్పగించారు. కుంటలో ఉన్న ఇతరత్రా ఆక్రమణలనూ తొలగించి.. 28.05 ఎకరాల విస్తీర్ణంలో చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇందుకోసం రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు హైడ్రా వర్గాలు తెలిపాయి.

### ఏఐ సునామీ వస్తోంది

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సునామీలా వస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దీంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలు పోతాయనే ఆందోళన నెలకొందని, దేశంలోని కోట్లాది మంది యువత నిరుద్యోగులుగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ సునామీని ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని, వైట్ కాలర్ ఉద్యోగాలకు బదులు బ్లూ కాలర్ ఉద్యోగాలు పెంచాలని అన్నారు. విద్యావిధానంలో మార్పులు తేవాలని, ఉపాధి కల్పించే దిశగా నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. ఇందుకు ఇప్పటినుంచే దూరదృష్టితో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో దేశంలో ఆకలి చావులు, నిరక్ష్యరాస్యత అధికంగా ఉండడంతో ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ముందుచూపుతో మంచి ప్రణాళికలు రచించి వాటిని అమల్లోకి తీసుకువచ్చారని చెప్పారు. దీని పర్యవసానంగానే ఇప్పుడు దేశంలో అన్ని చోట్లా విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయని, అందరికీ విద్య అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో భారీ సాగునీటి ప్రాజెక్టులనూ ఆనాడే నిర్మించారని, దీంతో కోట్లాది ఎకరాల భూములు సాగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఆహార ధాన్యాలు ఇక్కడ నుంచి విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి దేశం చేరుకుందన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఏవీఎన్ లేక్‌ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ ప్రారంభోత్సవానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడుతూ.. పేదరికం, వెనకబాటుతనం పోవాలంటే చదువు ఒక్కటే మార్గమని అన్నారు. కొందరికి భూములు ఉన్నప్పటికీ వెనకబాటుతనంతోనే ఉన్నారని, దీనికి కారణం చదువు లేకపోవడమేనని తెలిపారు. పేదరికంలో ఉన్నవారు చదువుకుని వెనుకబాటుతనం నుంచి బయటపడుతున్నారని చెప్పారు. చదువు మంచి జీవితాన్ని, గుర్తింపును ఇస్తుందన్నారు.

ఒక్కో విద్యార్థికి రూ.1.08 లక్షల ఖర్చు..

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని, దీనిపై ప్రజా ప్రతినిధులంతా ఆలోచించాలని సీఎం రేవంత్ అన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వం విద్య కోసం భారీగా నిధులు ఖర్చు చేస్తున్నా.. ఆ మేర ఫలితాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ''ప్రతి ఏటా రాష్ట్రంలో 1.10 లక్షల మంది విద్యార్థులు ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణులవుతున్నారు. కానీ, వీరిలో ఎంత మందికి ఉద్యోగావకాశాలు వస్తున్నాయి? వారు చదువుకున్న సర్టిఫికెట్‌కు, ఉద్యోగానికి సంబంధం ఉంటుందా? అనేది చూస్తే ఆందోళన కలుగుతోంది. నాణ్యమైన విద్య అందించకపోవడమే దీనికి కారణం'' అని సీఎం అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే ఒక్కో విద్యార్థి కోసం ప్రభుత్వం ఏటా రూ 1.08 లక్షలు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఇటీవల ఒక సర్వేలో ఆరో తరగతి చదివే విద్యార్థులు మూడో తరతగతి పుస్తకాలు కూడా చదవలేకపోతున్నట్లు తేలిందన్నారు. 9 మంది పిల్లలు ఉన్నచోట ఐదుగురు టీచర్లు పనిచేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 26 వేల స్కూళ్లలో 18 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వెల్లడించారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని 11 వేల ప్రైవేటు స్కూళ్లలో 33 లక్షల మంది చదువుతున్నారని చెప్పారు.




# పార్టీకి పాత పేరు.. కొత్త అజెండా!

(మొదటి పేజీ తరువాయి)



వేదికపైనే తమ అజెండా చెబుతామని, యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని కవిత వెల్లడించారు. ఎజెండా తెలియజేసిన తర్వాత పెద్దఎత్తున చేరికలు ఉంటాయని, విదేశాల్లో ఉంటున్న తెలంగాణ బిడ్డలు కూడా పార్టీలో చేరతామంటున్నారని తెలిపారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ తమకు గొప్ప అవకాశమని చెబుతూ.. సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలు మహిళలకు రిజర్వు అయితే వాటిలో ఒకదాన్నించి పోటీ చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ నిద్రావస్థలో ఉందని, తమకు ప్రథమ శత్రువు కాంగ్రెస్సేనని.. తమ పోరాటం ఆ పార్టీపైనే ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను ఆగం చేయాలని చూస్తున్నారని, అసలు సిటీని చంపకుంటే చాలని కవిత అన్నారు. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారంచేసి ఆ పార్టీని ఓడించారని.. ప్రస్తుతం కేరళలో ప్రచారం చేస్తున్నారని, అక్కడా కాంగ్రెస్‌ను ఓడిస్తారని ఎద్దేవా చేశారు. అమరావతి బిల్లు సందర్భంగా భద్రాచలం ఐదు గ్రామాల గురించి పార్లమెంటులో తెలంగాణ ఎంపీలు ప్రస్తావించాల్సి ఉండాల్సిందని, కానీ వారు పట్టించుకోలేదన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల నియంత్రణలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం ఏం చర్యలు తీసుకున్నారని కవిత ప్రశ్నించారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి ఫీజుల నియంత్రణ చట్టం ఎందుకు తీసుకురాలేదని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విద్యాకమిషన్ అతి చెత్త నివేదిక ఇచ్చిందని.. ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలనే సిఫారసు తప్ప దాంట్లో ఆమోద యోగ్యమైనది మరేదీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో 12 వేల ప్రైవేటు స్కూళ్లలో 38 లక్షలమంది విద్యార్థులు చదువుతున్నారని, యాజమాన్యాలు ఒకేసారి 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచి, దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. తాను బీఆర్ఎస్లో ఉన్నప్పుడు తనను నిజామాబాద్ కే పరిమితం చే సినప్పటికీ.. నారాయణ, చైతన్యలాంటి కార్పొరేట్ సంస్థలు అక్కడికి రాకుండా అడ్డుకున్నానని కవిత తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వేర్వేరు పేర్లతో ఆ సంస్థలు నిజామాబాద్‌కు వచ్చాయన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులు పెంచుతున్న స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రుల జీతాలు పెరగడం లేదని.. 7 శాతం నుంచి 8 శాతం ఫీజు పెంపునకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని సూచించారు. ఏటా భారీగా ఫీజులు పెంచుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు వాటిలో పనిచేస్తున్న టీచర్లు, ఉద్యోగుల జీతాలు మాత్రం పెంచడం లేదన్నారు. కార్పొరేట్, నార్త్‌ఇండియన్ స్కూళ్ల వారు తెలంగాణ వారికి కనీసం ధోబీగా కూడా అవకాశం ఇవ్వడం లేదని, అలాంటి వాటికి పర్మిషన్ ఇవ్వొద్దని కోరారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్ల పరిస్థితి దుర్భరంగా ఉందని, వారి హక్కుల సాధన కోసం పోరాడుతామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఉద్యమిస్తామని కవిత తెలిపారు.

## 6వ తరగతి నుంచి త్రిభాషా విధానం

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) తన కొత్త పాఠ్యప్రణాళికను శుక్రవారం విడుదల చేసింది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి నుంచి త్రిభాషా విధానాన్ని, 9వ తరగతికి గణితం, సైన్స్‌కు రెండు స్థాయిల విధానాన్ని దశలవారీగా అమలుచేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. భాషలను ఆర్1, ఆర్2, ఆర్3 అనే మూడు దశల వారీగా ఒక క్రమబద్ధమైన ఫ్రేమ్ వర్క్ ద్వారా నిర్వహిస్తారు. కొత్త జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్‌వర్క్(ఎన్‌సీఎఫ్) సిఫార్సుల ప్రకారం ఈ మూడు భాషల్లో రెండు భారతదేశానికి చెందినవై ఉండాలి. బహుభాషా విద్యను బోర్డు దశల వారీగా అమలు చేయడంలో భాగంగా 2026-27 విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి నుంచే మూడవ భాషను తప్పనిసరి చేయడం జరుగుతుంది అని బోర్డు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అదే భాషల విధానాన్ని అనుసరించడం వాంఛనీయమే అయినప్పటికీ విదేశీ పాఠశాలల నుంచి తిరిగి వచ్చే విద్యార్థులకు 8వ లేదా 9వ తరగతి వరకు అభ్యసించిన మూడవ భాష దేశీయ పాఠశాలల్లో అందుబాటులో లేని పక్షంలో అటువంటి అసాధారణ పరిస్థితుల్లో నిబంధనల ప్రకారం మినహాయింపు ఇవ్వవచ్చని ఆయన చెప్పారు. అయితే అటువంటి విద్యార్థులు నిర్దేశించిన మొత్తం సబ్జెక్టులను తప్పనిసరిగా చదవాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి రెండు స్థాయిల విధానాన్ని ప్రవేశపెట్టడంతో గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో ఓ ప్రధాన నిర్మాణాత్మక మార్పు రానున్నది.

## ఢిల్లీలో భూకంపం..

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో భూమి ఒక్కసారిగా కంపించింది. ఢిల్లీ - ఎన్‌సీఆర్‌తో పాటు ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంపం తీవ్రత 9.50 పీఎం(మాగ్నిట్యూడ్ ఎర్త్‌క్వేక్)గా నమోదైంది. భూమి కంపించడంతో ఇళ్లు, ఆఫీసుల నుంచి జనం ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు. ఢిల్లీతో సహా పంజాబ్‌లోని నోయిడా, ఛండీగఢ్, లూధియానాలో భూకంపం ప్రకంపనలు రేపింది. పూంచ్, శ్రీనగర్, ఉదమ్‌పూర్, జమ్ము కశ్మీర్‌లోనూ భూమి స్వల్పంగా కంపించింది. కొన్ని సెకన్ల పాటు తమ నివాసాలు ఊగిపోయాయని, ఇంట్లోని వస్తువులు కింద పడిపోయాయని.. తాము చాలా భయపడ్డామని కొందరు స్థానికులు తెలిపారు. అయితే.. భూకంపం కేంద్ర, తరంగాల ప్రభావం.. భూకంపం తీవ్రత గురించిన వివరాలు తెలియాల్సి ఉంది.

## విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో తేడాలు

చెన్నై: తమిళ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎన్నికలకు ముందే ఒక నియోజకవర్గాన్ని కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. ఎన్నికల్లో ఆయన పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్‌లలో పోటీ చేస్తూ నామినేషన్లు వేశారు. అయితే ఎన్నికల అఫిడవిట్‌ల్లో తేడాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. పెరంబూర్‌లో సమర్పించిన అఫిడవిట్‌లో తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని పేర్కొనగా, తిరుచ్చి అఫిడవిట్‌లో తనపై రెండు ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్టు పేర్కొన్నారు. అలాగే బ్యాంక్ ఖాతాలకు సంబంధించి ఇచ్చిన సమాచారం వేర్వేరుగా ఉన్నాయి. ఇలా ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారాన్ని ఇవ్వడం, వాస్తవాలను దాచిపెట్టడం ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం తీవ్రమైన ఉల్లంఘన కిందకు వస్తుందని, ఈ క్రమంలో ఆయన నామినేషన్‌ను తిరస్కరించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అంటున్నారు.

## కరీంనగర్‌లో దారుణం..

కరీంనగర్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 3:

జూబ్లీ నగర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. కన్న తండ్రే కాలయముడు అయ్యాడు. కడుపున పుట్టిన పిల్లలనే కనికరం లేకుండా హతమార్చాడు. జూబ్లీ నగర్ ప్రాంతానికి చెందిన శ్రీశైలం దంపతులకు గీతానిశి, గీతాన్విక అనే ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. ఏం జరిగిందో తెలియదు కాని వారి పట్ల కర్కశంగా ప్రవర్తించాడు శ్రీశైలం. ఇద్దరు చిన్నారులను బావి వద్దకు తీసుకెళ్లాడు. వారు ఎంత ఏడుస్తున్నా కనికరం లేకుండా అందులోకి తోసేశాడు. బాలికలిద్దరూ బయటకు వచ్చేందుకు ఎంత ప్రయత్నించినా ఈత రాకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కాపాడాలని తండ్రిని వేడుకుంటూ ఆర్తనాదాలు పెట్టారు. చివరికి ప్రాణాలు విడిచారు. అయితే, వారిని బావిలోకి తోసేసిన అనంతరం శ్రీశైలం అక్కడ్నుంచి పరారైనట్లు తెలుస్తోంది. పిల్లలు ఏరంటూ ఇంటికి వచ్చిన భర్త శ్రీశైలాన్ని భార్య ప్రశ్నించగా నీళ్లునమిలాడు. అనుమానం వచ్చి గట్టిగా ప్రశ్నించగా తనకు తెలియదంటూ దాట వేసే ప్రయత్నం చేశాడు. చిన్నారుల కోసం ఎంత వెతికినా జాడ తెలియకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. గ్రామానికి చేరుకున్న పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. ఓ బావిలో గీతానిశి, గీతాన్విక మృతదేహాలను గుర్తించారు. జీవచ్ఛవాలుగా పడి ఉన్న కూతుళ్లను చూసి బాధిత తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. శ్రీశైలాన్ని పోలీసులు గట్టిగా ప్రశ్నించడంతో ఆడుకుంటూ బావిలో పడ్డారని బుకాయించే ప్రయత్నం చేశాడు. ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బయటకు తీసిన పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే, భార్యాభర్తల మధ్య కలహాలే చిన్నారుల మృతికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. కాగా, కవలల మృతితో గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

## రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

సత్యదూరమైనవని కొట్టిపారేశారు. రేవంత్ విమర్శలపై శుక్రవారం ఫేస్‌బుక్ పోస్టు ద్వారా స్పందించిన ఆయన.. కేరళం అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి తప్పుడు సమాచారంతో మాట్లాడుతూ కేరళం ప్రజలను అవమానిస్తున్నారని ఆరోపించారు. తన రాష్ట్రంలో పేదల ఇళ్లను కూల్చివేయడం వంటి సమస్యలను పక్కనపెట్టి, కేరళంపై ఉపదేశాలు చేయడం సరైంది కాదని విమర్శించారు. కేరళం అభివృద్ధి నమూనా గురించి తెలుసుకోవడానికి ఇక్కడికి రావాలని ఆహ్వానించారు. కేరళం సుస్థిర, సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని చెప్పారు. కేరళంలో అవినీతి, పరిపాలనా వైఫల్యం ఉందని రేవంత్ చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. నీతి ఆయోగ్ సుస్థిరాభివృద్ధి సూచిక (2023-24)లో కేరళం మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ ఆరో స్థానంలో ఉందని తెలిపారు. కేరళంలో పేదరికం కేవలం 0.55 శాతమేనని, తెలంగాణలో అది 5.88 శాతంగా ఉందని చెప్పారు. అలాగే, కేరళం అక్షరాస్యత రేటు 95.3 శాతం కాగా, తెలంగాణలో అది 76.9 శాతం మాత్రమేనని పేర్కొన్నారు. శిశు మరణాల రేటు కేరళంలో 1000 జననాలకు 5 మాత్రమే ఉండగా, తెలంగాణలో అది దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా ఉందని అన్నారు. మెరుగైన ఆరోగ్య సదుపాయాలతో కేరళం ప్రజలు జాతీయ సగటు కంటే 5 నుంచి 7 సంవత్సరాలు ఎక్కువ కాలం జీవిస్తున్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కూడా విజయన్ విమర్శలు చేశారు. సొంత ప్రభుత్వంలో జీతాలు, పింఛన్లు ఆలస్యమవుతున్న పరిస్థితుల్లో, ఇతర రాష్ట్రాలపై విమర్శలు చేయడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. కాగా, అంతకుముందు కేరళంలో యూడీఎఫ్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసిన రేవంత్‌రెడ్డి.. విజయన్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

# గ్రామ ప్రజల ఆరోగ్యమే మా ప్రాధాన్యత



## నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ ఏప్రిల్ 3 ( వార్త వేదిక సూర్య):-

చింతపల్లి శ్రీ రాఘవేంద్ర పంక్షన్ హాల్ జరిగిన చింతపల్లి మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన గార్లపాటి యుగంధర్-జంగమ్మ దంపతుల కుమార్తెలు జోష్ణవి,లౌక్య కుమారుడు భరత్ నందన్ ల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఆయన వెంట సర్పంచ్ ఉజ్జిని కిషన్ రావు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు గోపాల్ గౌడ్,సర్పంచ్ రమావత్ తులసిరామ్,ఎలంకి అశోక్, ఖలీద్, వడత్య బాలు,కొండల్, తదితరులు పాల్గొన్నారు

## కొండమల్లేపల్లి సంస్కృతి స్కూల్లో గ్రాడ్యుయేషన్ దినోత్సవం

దేవరకొండ ఏప్రిల్ 3 ( వార్తా వేదిక సూర్య ):-




కొండమల్లేపల్లి మండల కేంద్రంలో గల స్థానిక సంస్కృతి పాఠశాలలో గురువారం నాడు ఘనంగా గ్రాడ్యుయేషన్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థిని,విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసిన సందర్భంగా విద్యార్థులకు డైరెక్టర్ కట్టా వెంకటరెడ్డి కరస్పాండెంట్ కట్టా శిరీష మరియు ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి విద్యార్థులకు డిగ్రీలను ప్రశంసా పత్రాలను అందజేస్తూ అభినందనలను తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్కృతి పాఠశాల డైరెక్టర్ కట్ట వెంకటరెడ్డి మరియు ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సంస్కృతి పాఠశాల ఎల్లప్పుడూ ముందు ఉంటుందని తెలియజేశారు

## యశీప కైసర్ ఖాన్‌ని పరామర్శించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ ఏప్రిల్ 3 ( వార్త వేదిక సూర్య ):-



కొండమల్లేపల్లి మండలానికి చెందిన యశీప కైసర్ ఖాన్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని శుక్రవారం నాడు హైద్రాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రికి చేరుకోని లియంప కైసర్ ఖాన్ గారిని పరామర్శించి,వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్య అధికారులకు సూచించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వారితో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జామున మాధవ రెడ్డి, నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

## సీఎం సహాయనిధి పేదలకు వరం

గట్టుప్పల.ఏప్రిల్ 3.వార్త వేదిక సూర్య:



గట్టుప్పల మండలంలోఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఖర్చుల నిమిత్తము ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మండలంలోని నామాపురం 4,వెల్మకన్నె 3,శేర్ గూడెం 3,తేరటుపల్లి 7,గట్టుప్పల 11,అంతపేట 9,కమ్మగూడెం 1 గ్రామాలకు చెందిన బాధితులకు సుమారు రూ.12,17,500 రూపాయల చెక్కులను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ నామని జగన్నాథం,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు దండు యాదగిరి రెడ్డి తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింగం వెంకటేశం,భీమనపల్లి రామయ్య,చందా శ్రీలత వెంకటేశం,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోదుగు బాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచుకట్ల సంపత్, ఉపసర్పంచ్ ఖమ్మం లక్ష్మయ్య,దోర్నాల అంజయ్య,చలమల్ల వెంకటరమణారెడ్డి, దోర్నాల భరద్వాజ్ నామని బుచ్చయ్య,భీమగాని మల్లేశం, దోర్నాల భరత్,చెరుపల్లి ఆంజనేయులు,వార్డు సభ్యులు పెదగాని నరేందర్,చెరిపెల్లి వెంకటేశం,పున్న శివ,గంజి వెంకటేశం,రావుల పర్వతాలు,పగిళ్ల యాదయ్య,గిరి శంకర్,బెదరకోట శ్రీనివాస్,మద్ది రమేష్ జాజుల యాదయ్య,భీమనపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ సేవ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం

### గుర్రపు తండాలో ఉచిత మెగా వైద్య శిబిరం

### జైరామ్ హాస్పిటల్ వారి సౌజన్యంతో

దేవరకొండ ఏప్రిల్ 3 ( వార్త వేదిక సూర్య ):-

కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుర్రపుతండా గ్రామ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్ రామావత్ సేవ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ చెక్ అప్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. కొండమల్లేపల్లి జైరామ్ హాస్పిటల్ డాక్టర్ వి భరత్ సింగ్ వారి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు వంద మంది గ్రామస్థులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. గ్రామస్తులకు షుగర్ టెస్ట్ మరియు బీపీ చెక్అప్ చేసిన అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సేవ నాయక్ మాట్లాడుతూ.. "పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశాం. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని" కోరారు.

శిబిరంలో గ్రామ పంచాయతీ సభ్యులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.ఈ శిబిరం ద్వారా ఆరోగ్యమే మహాభాగ్యం – ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే మా సంకల్పం అని డాక్టర్ వి భరత్ సింగ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ శిబిరంలో గ్రామ పంచాయతీ సభ్యులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది మరియు గ్రామ ప్రముఖులు ప్రజలు పాల్గొన్నారు



## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే.. పేదల సొంతింటి కల సాకారం





### - నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం
### - ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా

చౌటుప్పల్: ( వార్త వేదిక సూర్య )

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలో బోనకుర్తి సునీత-హరికృష్ణ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మా హాజరై ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో భాగంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో బోనకుర్తి సునీత-హరికృష్ణలు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకున్నారన్నారు. పేదల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, నిరుపేదల పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు.

త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గ్రామంలోని ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పక్కీరు శ్రీనివాస్ రెడ్డి,

వార్డు సభ్యులు ఊదరి శ్రీనువాస్, ఐతరాజు లింగస్వామి శారద, రాచకొండ భార్గవ్, జీడిముద్ద శోభ కొండల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లబోతు నారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉప సర్పంచ్ లు బత్తుల శ్రీహరి, కొంతం బుచ్చిరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఊదరి శంకర్, ఊదరి నర్సింహ, డాకోజీ సతీష్ వల్లబోతు నరేష్, సురేష్, జంగం సందీప్ బత్తుల వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## జాకీ ఎక్స్ క్లూజివ్ స్టోర్ ను ప్రారంభించిన చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్

చౌటుప్పల్: ( వార్త వేదిక సూర్య )

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని భాస్కర్ టాకీస్ పక్కన జాకీ ఎక్స్ క్లూజివ్ స్టోర్ ను శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ తన చేతుల మీదగా ప్రారంభించారు. షాపు యజమానులు టి శంకర్ - కుమారి దంపతులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం షాపు యజమానులు చైర్మన్ దంపతులను పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. వినియోగదారులను ఉద్దేశించి పి శంకర్ మాట్లాడుతూ..ఈ స్టోర్, యువత మరియు స్టైల్ పట్ల శ్రద్ధ వహించే వారిని ఆకట్టుకునేలా రూపొందించిన ఆధునిక జాకీ ఎక్స్ క్లూజివ్ స్టోర్ కలిగి ఉందని అన్నారు. పురుషులు, మహిళలు మరియు పిల్లల కోసం విస్తృత శ్రేణి దుస్తులు మరియు లోదుస్తులను అందిస్తుందని తెలియజేశారు. వినియోగదారులకు సరసమైన ధరలకే అందిస్తున్నామని తెలియజేశారు. జాకీ 1876లో స్థాపించడం జరిగిందని, జాకీ అనేదే ఒక బ్రాండ్ అని పేర్కొన్నారు. ఈ యొక్క ప్రారంభోత్సవ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్, బత్తుల వాణి విప్లవ్ గౌడ్, బుడ్డ సురేష్, ప్రముఖ వ్యాపారవేత్త మంచి కంటి భాస్కర్ గుప్తా,కాంగ్రెస్ పార్టీ నాయకులు తొర్పునూరి నరసింహ గౌడ్, పబ్బు శ్రీకాంత్ గోషిక నరసింహ, తదితరులు పాల్గొన్నారు.




## బొడ్డు మణెమ్మ నీ పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ ఏప్రిల్ 3 ( వార్త వేదిక సూర్య ):-



దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు బొడ్డు లక్ష్మయ్య భార్య బొడ్డు మణెమ్మ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద ఉన్న బొడ్డు మణెమ్మ నీ బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు గోపాల్ గౌడ్, బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ తులిసీరామ్, వడత్య బాలు, సయ్యద్, గోపి తదితరులు ఉన్నారు



## ఏడవ వార్డులో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో ఏడవ వార్డు కౌన్సిలర్ హనుమంతు సాయి చంద్ గౌడ్

దేవరకొండ ఏప్రిల్ 3 ( వార్త వేదిక సూర్య):-

గురువారం రోజు దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వార్డు సభ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి 7వ వార్డు కౌన్సిలర్ హనుమంతు సాయి చంద్ర గౌడ్ అధ్యక్షత జరిగినది ఈ సందర్భంగా వార్డు సభలో కౌన్సిలర్ సాయి చందు గౌడ్ ప్రసంగిస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరంగా చర్చించారు. ప్రజల జీవిత ప్రమాణాలను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, అలాగే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారాలు అందించడానికి కట్టుబడి ఉన్నానని మా తాతగారైన స్వర్గీయ చంద్రన్న ఆశాలకై దేవరకొండ గ్రామపంచాయతీ అభివృద్ధి చేశాడు అదేవిధంగా నేను కూడా నా ఏడో వార్డును అభివృద్ధి కార్యక్రమంలో ముందు ఉంచుతానని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. అదేవిధంగా, ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రజల అవసరాలను అధికారులు మరియు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల భాగస్వామ్యం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి పద్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు పెద్దలు, మహిళలు, యువత మరియు ఇతర ప్రముఖులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## పడమటి పల్లి గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు పార్టీ ఆర్థిక సాయం

దేవరకొండ ఏప్రిల్ 3 ( వార్తా వేదిక సూర్య ):-





దేవరకొండ నియోజకవర్గం లోని పడమటి పల్లి గ్రామానికి చెందిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు ఇటీవల మరణించిన పల్లె దుర్గయ్య, పల్లె కృష్ణయ్య కుటుంబాలకు సిపిఐ పడమటిపల్లి గ్రామ శాఖ తరఫున 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది

ఈ కార్యక్రమంలో సిపిఐ ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పడమటి పల్లి శాఖ కార్యదర్శి పల్లా రంగారెడ్డి, శాఖ సహాయ కార్యదర్శులు మాజీ సర్పంచ్ కిన్నెర యాదయ్య, కాటం గోవర్ధన్, నాయకులు ఉడుత జంగయ్య, కావాలి బాల్రామ్, పల్లె ప్రభాకర్, పల్లె మధు తదితరులు పాల్గొన్నారు

# బేతెస్థ ఖాసీంపేట లో గుడ్ ఫ్రైడే హోలీ ఫ్రైడే ఆరాధనా

## మానవాళి పాప పరిహారార్థం సిలువపై ప్రాణాలు అర్పించిన జీసస్

## క్రీస్తు మరణం ప్రేమ క్షమాపణ త్యాగం

## బిషప్ దుర్గం హెప్సిబా ప్రభాకర్





నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 3 (వార్తా వేదిక సూర్య )

సూర్యాపేట 4 వ వార్డు ఖాసీంపేట బేతెస్థ మినిస్ట్రీస్ మెయిన్ చర్చి నందు గుడ్ ఫ్రైడే సందర్భంగా బిషప్ దుర్గం హెప్సిబా ప్రభాకర్ మాట్లాడుతూ క్రీస్తును శిలువ వెయ్యటం, కల్వరి(కపల) కొండ వద్ద అతని మరణం యొక్క జ్ఞాపకాలను గుర్తుచేసుకొనేక్రైస్తవమత విశ్వాసులకి,ప్రపంచ మానవాళికి గొప్ప రక్షణ దినం అనీ,ఈ పవిత్ర వారం సమయంలో పవిత్రమైన మూడు రోజులలో భాగంగా ఈస్టర్ఆదివారానికి ముందు వచ్చేశుక్రవారంరోజున యేసు క్రీస్తు మానవాళి పాపములు క్షమించబడుటకొరకు తన్ను తాను శిలువ మరణం కొరకు తన ప్రాణంను అర్పించుకొన్నాడనీ తరచుగా పాసోవర్ పై యూదుల అభిప్రాయంతో సరిగ్గా సరిపోలుతుందనీ దీనిని హోలీ ఫ్రైడే, బ్లాక్ ఫ్రైడే మహాశాంగ్రేట్ ఫ్రైడే అని కూడా పిలువబడుతుందనీ క్రీస్తు సువార్తల ఆధారంగా క్రీస్తును శిలువ వెయ్యటం శుక్రవారమే జరిగిందనీ రెండు వేర్వేరు సమూహాలచే గుడ్ ఫ్రైడే యొక్క సంవత్సరం సా.శ. 33 గా అంచనా వెయ్యబడిందనీ వాస్తవానికి బైబిలికల్, జూలియన్ క్యాలెండర్ల మధ్య ఉన్న వ్యత్యాసాలు చంద్రవంకద్వారా ఐజాక్ న్యూటన్ అనే ఖగోలా శాస్త్ర వేత్తచే సా.శ. 34 గా చెప్పబడింది శిలువ వేసినప్పుడు చంద్రుని కాంతి తగ్గిపోయి చీకటి అవ్వటం, అదే తేదీన అనగా శుక్రవారం ఏప్రిల్ 3, సా.శ. 33 న గ్రహణం ఏర్పడటం 2:20 చట్టాలలో "మూన్ ఆఫ్ బ్లడ్" పై అపోస్తలీక్ పీటర్ యొక్క సూచనతో సంబంధం కలిగి ఉంటుందనీ ఈ ఆధారంగా చెప్పబడిన ఒక పూర్తి వైవిధ్యమైన ఖగోళపరమైన విధానం సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ఆయన సిలువపై ప్రాణాలు అర్పించారని, సైన్ట్ ఫిక్ గా మరియు బిబిలికల్ గా ఋజువు చేయబడిందని అన్నారు.ఈ కార్యక్రమం లో తీతు, బాబు,ఉపేందర్, బాబు, యేసుపాదం, వెంకన్న,జానయ్య తదితరులు పాల్గొన్నారు.





## పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడికి నిరసన

## నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలి: ఏఐటీయూసీ నేత జైపాల్ రెడ్డి డిమాండ్

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 03 ( వార్త వేదిక సూర్య ) :

విధి నిర్వహణలో ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలిపై అసభ్య పదజాలంతో దూషించి, భౌతిక దాడికి పాల్పడటం అత్యంత దారుణమని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మండిపడ్డారు.

గురువారం ఉదయం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హసన్ నగర్ చౌరస్తాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పారిశుద్ధ్య కార్మికురాలు ఎన్. సత్యమ్మ (55) గురువారం తెల్లవారుజామున 5:30 గంటలకు విధులకు హాజరై, హసన్ నగర్ చౌరస్తాలోని గ్రాండ్ హోటల్ వద్ద పారిశుద్ధ్య పనులు చేస్తోంది. ఈ క్రమంలో హోటల్‌లో పనిచేసే వ్యక్తిని టీ అడగగా, అక్కడ ఉన్న ఒక గుర్తుతెలియని వ్యక్తి ఆమెపై అత్యంత నీచంగా బూతు పురాణం అందుకున్నాడు.

"మీ ఇంట్లో ఆడవారిని ఇలాగే అంటారా?" అని బాధితురాలు ప్రశ్నించడంతో ఆగ్రహానికి గురైన సదరు వ్యక్తి ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. అక్కడ ఉన్న శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎస్ఎఫ్ఏ) అడ్డుకునే ప్రయత్నం చేయగా, నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన సత్యమ్మ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందారు. వైద్యులు దీనిని ఎమ్మెల్సీ (ఎం ఎల్ సి నెం: 10809) కేసుగా నమోదు చేశారు. అనంతరం బాధితురాలు బహదూర్‌పుర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బాధితురాలిని పరామర్శించిన జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కల్పించడంలో వైఫల్యం చెందితే అత్తాపూర్ సర్కిల్ వ్యాప్తంగా కార్మికులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

# దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిస్తాం



## పాలడుగు నాగార్జున, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 3 (వార్తా వేదిక సూర్య )

తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధించడానికి కట్టుబడి ఉన్నామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు. శుక్రవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య పేరు తెలంగాణ రైతాంగ పోరాటాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు.సుమారు 1920 ప్రాంతంలో నల్గొండ జిల్లా కడవెండి గ్రామంలో జన్మించిన కొమురయ్య, నిజాం పాలనలో సామంతుల దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన రైతాంగ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు.1946లో దొరల గుండాల కాల్పుల్లో అమరుడయ్యారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి తొలి అమరుడిగా ఆయన గుర్తింపు పొందారు. ఆయన మరణంతో ఉద్యమం మరింత ఉద్ధృతమైంది.

కొమురయ్య పోరాట స్పూర్తి

సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడటం.పేద రైతుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేయడం.సమానత్వ సమాజం కోసం నిరంతర పోరాటం

సమాజానికి సందేశం

1. అన్యాయానికి ఎదురు నిలబడాలి
2. భూమి, జీవన హక్కుల కోసం ఐక్యత అవసరం
3. కుల, వర్గ భేదాలు లేకుండా సమాన హక్కులు ఉండాలి
4. యువత సామాజిక సమస్యలపై స్పందించి పోరాట పంథాను కొనసాగించాలి

దొడ్డి కొమురయ్య జీవితం మనకు గొప్ప పాఠం చెబుతుందని, అన్యాయం ఎక్కడ ఉన్నా ఎదుర్కోవాలని, ప్రజల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఆయన జయంతి సందర్భంగా కొమురయ్య త్యాగాలను స్మరించుకుంటూ సమానత్వం న్యాయం కోసం ముందుకు సాగుదామని అన్నారు.

ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు, సామాజిక ప్రజాసంఘాల నాయకులు, జిల్లా అధికారులు, గీతా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా వెంకన్న, నరసింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ మహారాజ్‌కి ఘన నివాళి



దేవరకొండ ఏప్రిల్ 3 ( వార్త వేదిక సూర్య ):-

చత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా కొండమల్లేపల్లి చౌరస్తాలో చత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.మరాఠా సామ్రాజ్య వ్యవస్థాపకులు చత్రపతి శివాజీ గారు 1680 ఏప్రిల్ 3న రాయగడ్ కోటలో తుది శ్వాస విడిచారని అన్నారు. ఇదే రోజు దేశవ్యాప్తంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పిస్తారని అన్నారు.హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించి మొఘల్,బీజాపూర్ సుల్తానులను ఎదిరించిన గొప్ప వీరుడిగా ఆయనను మనం స్మరించుకోవడం గొప్ప విషయం అన్నారు.

శివాజీ మహారాజ్ ధైర్య సాహసాలు,యుద్ధ వ్యూహాలు, పరిపాలన దక్షిత నేటికీ స్పూర్తిదాయకమని అన్నారు. ఆయన మరణానంతరం ఆయన కుమారుడు చత్రపతి శంభాజీ ఆయన ధైర్యసహసాలను పునికి పుచ్చుకొని రాజ్యాలను కాపాడారని అన్నారు. అటువంటి మహానుభావుడిని ప్రతి ఒక్క హిందువు స్మరించుకోవాలన్నారు. కొండమల్లేపల్లిలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని అందరి సహకారంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు అధికారులు సహకరించాలని కోరారు.

చిన్న చిన్న గ్రామాలలో చత్రపతి శివాజీ విగ్రహాలు ఉన్నాయని, కొండమల్లేపల్లి పట్టణంలో ఇప్పటివరకు చత్రపతి శివాజీ గారివిగ్రహాన్ని ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఐక్యతతో ముందుకు వచ్చి చత్రపతి శివాజీ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందామన్నారు.

ఈ కార్యక్రమంలో ఏడుకొండ రాము, కూన భానుచందర్, అలంపల్లి విజయ్, బొడ్డుపల్లి మల్లికార్జున్, బొడ్డుపల్లి చంద్రమౌళి, మలికంటి ఆంజనేయులు, గుండెబోయిన రవి, డబ్బు శ్రీకాంత్,నగేష్ తదితరులు పాల్గొన్నారు



# ఫార్మా కంపెనీ నిర్మాణ పనులను నిలిపివేయ్యాలి

గట్టుప్పల.ఏప్రిల్3.వార్త వేదిక సూర్య:

ఫార్మా కంపెనీ పనులు నిలిపివేయాలి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తో చారవణిలో గట్టుపల మండలం బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ ఇడం కైలాసం కోరారు.గట్టుపల మండల కేంద్రంలో 2023 లో నిలిచిపోయిన కాంతి ఫార్మా నిర్మాణ పనులను తిరిగి ప్రారంభిస్తున్నట్టుగా సమాచారం అందిందని, వెంటనే ఈ విషయమై ఎమ్మెల్సీ నెల్లికంటే సత్యమును చరవారిలో సంప్రదించి ఫార్మా కంపెనీ పనులు నిలిపివేఉంచాలని కోరడం జరిగింది. అదేవిధంగా ఆ ప్రాంతాన్ని సందర్శించడానికి రావాల్సిందిగా కోరడం జరిగింది. స్పందించిన ఎమ్మెల్సీ సత్యం గారు త్వరలోనే విచ్చేస్తానని తెలిపారు, ఏది ఏమైనా గతంలో అప్పటి ప్రభుత్వంతో పోరాడి ఒప్పించి ఫార్మా కంపెనీ పనులను నిలిపి వేయించామని తిరిగి ఇప్పుడు పనులు ప్రారంభం కావడం దురదృష్టకరమని అన్నారు, ఈ సందర్భముగా గత ఎన్నికల ప్రచారం లో స్థానిక శాసన సభ్యులు ఫార్మా రహిత మునుగోడు చేస్తామని చెప్పిన విషయాన్ని.గుర్తు చేస్తూ మీడియా ద్వారా ఫార్మా కంపెనీ పనులు నిలిపివేయించాలని కోరుతున్నట్లు తెలిపారు.ఫార్మానుపార ధోని మన ప్రాంతాన్ని కాపాడుకుందాం అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు నాయకులు ఈ విషయమై ముందుకు రావాలని కోరారు. కలిసి కట్టుగా మరోసారి పోరాడి ఫార్మా భూతాన్ని ప్రార ద్రోలుదామని అన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన 03 డివిజన్ కార్పొరేటర్ పేర్ల మల్లిశ్వరి- అశోక్ చంద్ర

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 3 (వార్తా వేదిక సూర్య )



మూడవ డివిజన్ పానగల్లు కు చెందిన టిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు చింత కార్తీక్ తాత గురజాల కోల్లయ్య అనారోగ్యం కారణంగా నిన్న రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి 5000/- వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి అందజేసారు. ఈ కార్యక్రమంలో బుర్రి యాదగిరి, గుండగోని సందీప్, వేముల హరి, గాలి మురళి, గాలి సాయి, చింత కార్తీకు ,గురజాల శ్రీకాంత్ ,మేతరి బాలకృష్ణ, మేతరీ ప్రవీణ్, పేర్ల గోవర్ధన్ తదిరులు పాల్గొన్నారు.

## జనవాసాల మధ్య ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్

-తక్షణమే తొలగించాలని బాబుల్ రెడ్డి నగర్ వాసుల డిమాండ్



మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 03 ( వార్త వేదిక సూర్య ) :

కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ కాలనీలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రదేశానికి తరలించాలని కాలనీవాసులు అధికారులను కోరారు. ఈ మేరకు సంబంధిత ఎ. ఈ కి సామూహిక ఫిర్యాదు సమర్పించారు. నివాస ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా అనేక సమస్యలు ఎదురవుతున్నాయని ప్రజలు తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఆడుకోవడం వల్ల ప్రమాదాల భయం నెలకొన్నదని పేర్కొన్నారు. అలాగే, కొన్ని సందర్భాల్లో స్పార్కింగ్ జరగడం, వర్షాకాలంలో నీరు చేరడం వల్ల ప్రమాదం మరింత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్ నివాస ప్రాంతంలో ఉండటం భద్రతా పరంగా, ఆరోగ్య పరంగా ప్రమాదకరమని కాలనీవాసులు తెలిపారు.

కాబట్టి, సంబంధిత అధికారులు ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే సురక్షిత ప్రదేశానికి మార్చి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు

# బాటసారుల దాహార్తి తీర్చడం అభినందనీయం

## - మణికొండలో 'అరుణాచల శివ సేవ సత్సంగ్' ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం




మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 03 ( వార్త వేదిక సూర్య ) :

వేసవి తాపంతో అల్లాడిపోయే బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసే చలివేంద్రాలు మానవత్వానికి నిదర్శనమని పలువురు నేతలు కొనియాడారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్ర బ్యాంక్ సర్కిల్ వద్ద అరుణాచల శివ సేవ సత్సంగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామకృష్ణ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ ఉపశమనం కలిగించే ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎండలో అలసిపోయి వచ్చే వారికి చల్లటి నీరు అందించడం అత్యంత పుణ్యకార్యమని, సత్సంగ్ సభ్యుల సేవా దృక్పథాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్సంగ్ ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మరియు స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అమరవీరుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధనే లక్ష్యం

## మణికొండలో ఘనంగా 99వ జయంతి వేడుకలు



మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 03 ( వార్త వేదిక సూర్య ) :
తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 99వ జయంతి వేడుకలను మణికొండ డివిజన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ శ్రీ బీరప్ప మల్లన్న స్వామి సదనంలో జరిగిన ఈ కార్యక్రమానికి కురుమ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్ని. దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం చైర్మన్ బి. జైహింద్ రావు మాట్లాడుతూ.. నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ప్రాణాలర్పించిన వీరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. ఆయన త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు సి. బీరప్ప, ప్రధాన కార్యదర్శి ఇ. వెంకటేశ్వరరావు, కోశాధికారి గణేష్, కమిటీ సభ్యులు ఇ. యాదయ్య, బి. శ్రీరాములు (పెద్ద), డి. బాబు, బి. ముత్యాలు, డి. లక్ష్మణ్, డి. కృష్ణ, బి. ఆంజనేయులు, బి. సదానంద, బి. దశరథ్, డి. కిట్టు, డి. మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో బీసీ రక్షణ చట్టం తీసుకురావాలి: ఆడికే మహేందర్

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 03 ( వార్త వేదిక సూర్య ) :
జనగామ జిల్లా దేవరపల్లి మండలం కడివెండి గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం సీనియర్ నాయకులు ఆడికే మహేందర్ కుర్మా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజాం పాలనలో పేద ప్రజలు ఎదుర్కొన్న అన్యాయాలను ఎదుర్కొనేందుకు దొడ్డి కొమురయ్య తన అన్న దొడ్డి మల్లయ్యతో కలిసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. భూమి, పంటలు, నీటి హక్కుల కోసం ప్రజలను ఏకం చేసి దోపిడీ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించారని గుర్తుచేశారు. 1946 జూలై 4న కడివెండి గ్రామంలో దేశ్ముఖ్ అనుచరులు, రజాకార్ల కాల్పుల్లో ఆయన వీరమరణం పొందారని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో బీసీ వర్గాల హక్కుల కోసం దొడ్డి కొమురయ్య బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని కోరారు.

# రాజేంద్రనగర్‌లో ఘనంగా 'హిందూ సమ్మేళనం'

### - హరిహర క్షేత్రం వేదికగా హిందూ బంధువుల ఐక్యత

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 03 ( వార్త వేదిక సూర్య ) :
హిందూ సమాజాన్ని సుసంఘటితం చేసే లక్ష్యంతో శనివారం (ఏప్రిల్ 4) రాజేంద్రనగర్‌లోని హరిహర క్షేత్రంలో భారీ 'హిందూ సమ్మేళనం' నిర్వహిం చను న్నారు. సాయంత్రం 5:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రపంచ వాసవీ మహాపీఠాధీశ్వరులు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ శ్రీధర స్వామీజీ విచ్చేయనున్నారని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ 1925లో ప్రారంభమై, ఈ వంద సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ఎదురైన ఎత్తుపల్లాలను అధిగమిస్తూ, నేటి సామాజిక సవాళ్లను ఎదుర్కొనేందుకు హిందువులందరూ ఏకతాటిపైకి రావాలని ఈ కార్యక్రమాన్ని తలపెట్టారు. హిందూ సమాజం పట్ల గౌరవభావం, ఏకాత్మతా భావనను పెంపొందించడం, స్వధర్మం పట్ల అంకితభావం మరియు సేవాగుణాన్ని యువతలో వికసింపజేయడం ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశ్యం. మన దేశాన్ని తిరిగి 'విశ్వగురువు'గా నిలపాలనే సంకల్పంతో హిందూ బంధువులందరినీ ఈ వేదిక ద్వారా సమైక్యపరచ నున్నారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ వాసవీ మహాపీఠాధీశ్వరులు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ శ్రీధర స్వామీజీ ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారు. ముఖ్య వక్తగా ఎర్ర నర్సింగ్ పాల్గొని ప్రస్తుత పరిస్థితుల్లో హిందూ ఐక్యత ఆవశ్యకతను వివరిస్తారు. ప్రముఖ హైకోర్టు న్యాయవాది మౌనిక సుంకర మహిళా వక్తగా హాజరై ప్రసంగిస్తారు. ఈ సమ్మేళనానికి హిందూ బంధువులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.




# దుర్గానగర్ బస్ స్టాప్ వద్ద ఆటోల ఆక్రమణ: ప్రయాణికుల తీవ్ర అవస్థలు





మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 03 ( వార్త వేదిక సూర్య ) :
మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్ బస్ స్టాప్ వద్ద ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. బస్ స్టాప్ ప్రాంగణాన్ని ఆటో డ్రైవర్లు, పండ్ల వ్యాపారులు అక్రమంగా ఆక్రమించు కోవడంతో సామాన్య ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

దుర్గానగర్ సిగ్నల్ పక్కనే ఉన్న ఈ బస్ స్టాప్ వద్ద నిత్యం ఆటోలను నిలిపి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనివల్ల ఆర్టీసీ బస్సులు స్టాప్‌లోకి రావడానికి వీలు లేకుండా పోతోంది. ఫలితంగా బస్సులు రోడ్డుపైనే ఆగుతుండటంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడటమే కాకుండా, కొన్నిసార్లు బస్సులు అసలు ఆగకుండానే వెళ్ళిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్ స్టాప్‌కు అతి సమీపంలోనే పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ, నిత్యం ట్రాఫిక్ పోలీసులు అక్కడే విధుల్లో ఉంటున్నప్పటికీ ఈ ఆక్రమణలను పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే వ్యాపారులు రోడ్డుపైనే అడ్డంగా ఆటోలు నిలుపుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రోడ్డుపై నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, బస్ స్టాప్ వద్ద ఆటోలను తొలగించి ప్రయాణికులకు మార్గం సుగమం చేయాలని వారు కోరుతున్నారు.

# బుద్వేల్‌లో 'ప్రజా పాలన' వైద్య శిబిరంకు విశేష స్పందన

### - 250 మందికి పైగా రోగులకు ఉచిత





### పరీక్షలు, మందుల పంపిణీ

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 03 ( వార్త వేదిక సూర్య ) :
రాష్ట్ర ప్రభుత్వ '99 రోజుల ప్రజా పాలన' కార్యక్ర మంలో భాగంగా రంగారెడ్డి జిల్లా, మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బుద్వేల్ సబ్ సెంటర్ వద్ద శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అసంక్రామ్య వ్యాధుల (ఎన్ సి డి) నిర్ధారణే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మరియు మైలార్‌దేవ్‌పల్లి మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగింది. బుద్వేల్ సబ్ సెంటర్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఖాజీ మిస్బా అహ్మద్ ఆధ్వర్యంలో సుమారు 250 మందికి పైగా రోగులకు రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఈ శిబిరంలో సెక్టార్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు మరియు ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి రోగులకు అవసరమైన సేవలు అందించారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయడమే లక్ష్యంగా ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మిస్బా అహ్మద్ తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# నేటి తరం యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి : సాయి మల్లిక్



మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 03 ( వార్త వేదిక సూర్య ) :
హిందూ స్వరాజ్య స్థాపకుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్ 346వ వర్ధంతి వేడుకలను అత్తాపూర్ పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అత్తాపూర్ ఎంక్యూబే మాల్ సమీపంలోని శివాజీ మహారాజ్ విగ్రహానికి శ్రీనివాస సేవా సమితి చైర్మన్, సామాజిక కార్యకర్త పెండ్యాల సాయి మల్లిక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెండ్యాల సాయి మల్లిక్ మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ చూపిన ధైర్యసాహసాలు, దేశభక్తి ఎప్పటికీ మరువలేనివ న్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడి, ధర్మాన్ని కాపాడిన మహోన్నత వీరుడు శివాజీ అని కొనియాడారు. నేటి తరం యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలు, అర్జున్ మరియు శ్రీనివాస సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థుల నుంచే ఫీజు వసూలు

### 2026-27 విద్యాసంవత్సరం నుంచి చేసుకోవచ్చు

### హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు

### పిటిషన్ వేసిన 15 కాలేజీలకే ఈ వెసులుబాటు

### తుది తీర్పు భిన్నంగా ఉంటే ఫీజు వాపస్ ఇవ్వాలని స్పష్టీకరణ

### కోర్టు మెట్లు ఎక్కేందుకు సిద్ధమవుతున్న మరిన్ని కాలేజీలు

### రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేటు కాలేజీల పోరుబాట

హైదరాబాద్, ఏప్రిల్ 3( వార్త వేదిక సూర్య ):
కాలేజీల్లో ఫీజుల వసూలు, ఫీజు రియింబర్స్‌మెంట్‌పై హైకోర్టు శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఫీజులను కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల నుంచే వసూలు చేసుకోవచ్చని జస్టిస్ జువ్వాడి శ్రీదేవి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ప్రకటించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం సకాలంలో చెల్లించటం లేదని, అందువల్ల ఫీజులను విద్యార్థుల నుంచే వసూలు చేసుకొనేందుకు అనుమతి ఇవ్వాలని 15 కాలేజీలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం వచ్చే విద్యా సంవత్సరం నుంచి మొత్తం ఫీజును విద్యార్థుల నుంచే వసూలు చేసుకోవచ్చని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పిటిషన్ వేసిన కాలేజీలకు మాత్రమే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని స్పష్టంచేసింది.

అయితే, తుది తీర్పునకు లోబడి ఫీజుల వసూలు విధానం ఉంటుందని స్పష్టంచేసింది. తుదితీర్పు మధ్యంత ఉత్తర్వులకు భిన్నంగాఉంటే విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులను కాలేజీలు తిరిగి చెల్లించాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. అంతకు ముందు 15 ప్రైవేటు కాలేజీల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో ప్రభుత్వం విపరీత జాప్యం చేస్తుండటంతో కాలేజీలను నడపలేకపోతున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఉన్న నిబంధనల ప్రకారం కాలేజీలు విద్యార్థుల నుంచి నేరుగా ఫీజులు చేసుకోలేవని, ప్రభుత్వం ఇస్తేనే స్వీకరించాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు.

ఇలాగైతే కాలేజీల నిర్వహణ అసాధ్యమని అన్నారు. ప్రభుత్వం ఇవ్వకపోతే కాలేజీలకే నేరుగా వసూలు చేసుకొనే హక్కు ఇవ్వాలని, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో జాప్యం చేస్తే 18 శాతం వడ్డీ ఇవ్వాలని, ఆ మొత్తం ప్రభుత్వం నేరుగా విద్యార్థులకే చెల్లించేలా ఆదేశాలివ్వాలని కోరారు.

వాదనల అనంతరం పిటిషనర్లకు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకొనే అవకాశం ఇస్తూ ధర్మాసనం మధ్యంతర ఆదేశాలిచ్చింది.

ఫీజు బకాయిల కోసం మళ్లీ పోరుబాట

ఈ ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రంలోని ఇతర ప్రైవేటు కాలేజీ కూడా ఇదే విధమైన ఉత్తర్వుల కోసం హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నాయి. దీనిపై యాజమాన్యాలు శుక్రవారం సమావేశమై నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరోవైపు ఫీజు బకాయిల వసూలు కోసం మళ్లీ ఆందోళనలు చేపట్టాలని తెలంగాణ ప్రైవేటు కాలేజీల యాజమాన్య సంఘాల సమాఖ్య (ఫాతీ) నిర్ణయించింది.

శుక్రవారం నగరంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఫాతీ చైర్మన్ రమేశ్ బాబు తదితరులు పాల్గొని గతంలో మంత్రులు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డిల కమిటీతో వెంటనే భేటీ కావాలని ఫాతీ నిర్ణయించింది.

వారినుంచి సానుకూల నిర్ణయం రాకుంటే 11న రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యచరణ ప్రకటించాలని సమావేశంలో తీర్మానించారు.

# వంటింటిపైనా యుద్ధ ప్రభావం

### వంట నూనెల దిగుమతులకూ అడ్డంకులు
### సలసల కాగుతున్న వంట నూనెల ధర
### లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర రూ.200పైనే
### సోయా, పామాయిల్‌కు మళ్లుతున్న మధ్య తరగతి



**న్యూఢిల్లీ:** గల్ఫ్ యుద్ధం వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేస్తోంది. దిగుమతయ్యే సన్ ఫ్లవర్, సోయా నూనెల ధరలు ఈ యుద్ధంతో మరింతగా పెరిగాయి. ఈ ఏడాది జనవరిలో రిటైల్ మార్కెట్లో రూ.150 పలికిన లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్.. ప్రస్తుతం కంపెనీని బట్టి రూ.190 నుంచి రూ.202 వరకు పలుకుతోంది. లీటరు విజయ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర సైతం ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాల్లో రూ.202కు చేరింది. ఇక కోల్డ్ ప్రెస్డ్ సన్ ఫ్లవర్ అయిల్ ధరైతే కొన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాల్లో లీటరు రూ.280 నుంచి రూ.350 మధ్య పలుకుతోంది. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం వంట నూనెల ధరలకు మరింత సెగ పెడుతోంది.

**ఇతర వంట నూనెలదీ అదే పరిస్థితి**

ఇతర వంట నూనెలదీ ఇదే పరిస్థితి. వేరుశనగ దిగుబడులు తగ్గడంతో పల్లీ నూనె ధరా దూసుకుపోయింది. గత ఏడాది డిసెంబరులో రూ.175-180 మధ్య పలికిన కిలో వేరుశనగ నూనె ప్రస్తుతం రూ.200 నుంచి రూ.220 మధ్య పలుకుతోంది. ఆవనూనెదీ ఇదే పరిస్థితి. గత ఏడాది ఏప్రిల్‌లో కిలో రూ.170 పలికిన కిలో ఆవ నూనె ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో రూ.188-190 మధ్య ఉంది. గత నెల 2న కిలో రూ.136 పలికిన పామాయిల్ ధర ప్రస్తుతం బ్రాండ్‌ను బట్టి కిలో రూ.141 నుంచి రూ.150 మధ్య పలుకుతోంది.

**పెరిగిన నౌకా రవాణా చార్జీలు**

మన దేశంలో ఎక్కువగా వినియోగించే సన్ ఫ్లవర్‌లో ఎక్కువ భాగం రష్యా, ఉక్రెయిన్ దేశాల నుంచే రావాలి. గల్ఫ్ యుద్ధంతో ఈ దేశాల నుంచి వంట నూనెలతో వచ్చే నౌకల ప్రయాణాలకు ఆటంకం ఏర్పడింది. దీంతో నౌకా కంపెనీలు రవాణా చార్జీలు పెంచేశాయి. సరఫరా అడ్డంకులతో పాటు రవాణా చార్జీల భారం తోడవడంతో దిగుమతిదారులు ధరలు పెంచేశారు. ఆ ప్రభావం రిటైల్ మార్కెట్‌పైనా కనిపిస్తోంది. ఈ యుద్ధం మరింత కాలం కొనసాగితే వంటింటి బడ్జెట్ పెద్ద గుదిబండగా మారుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

**తగ్గనున్న సన్‌ఫ్లవర్ ఆయిల్ అమ్మకాలు**

సన్ ఫ్లవర్ ఆయిల్ ధరల మంటతో అనేక మంది మధ్య తరగతి ముఖ్యంగా దిగువ మధ్యతరగతి ప్రజలు పామాయిల్ వంటి చౌకగా వచ్చే ప్రత్యామ్నాయాలకు మారుతున్నారు. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) దేశం లో సన్‌ఫ్లవర్ ఆయిల్ అమ్మకాల పరిమాణం 10 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ ఇటీవల ఒక నివేదికలో తెలిపింది. ప్రస్తుతం కిలో సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర.. సోయా, రైస్ బ్రాన్ ఆయిల్ కంటే రూ.10 నుంచి రూ.20 ప్రీమియంతో అమ్ముడవుతోంది.

**తగ్గుతున్న నిల్వలు**

మరోవైపు దేశంలో వంట నూనెల నిల్వలు పడిపోతున్నాయి. ఈ యుద్ధం ప్రారంభానికి ముందు దేశంలో 30 నుంచి 45 రోజుల అవసరాలకు సరిపడా వంట నూనెల నిల్వలు ఉండేవి. సరఫరా అడ్డంకులతో ఇప్పుడవి 20 నుంచి 30 రోజుల అవసరాలకు పడిపోయాయి. హోర్ముజ్ మూసివేతకు ఇప్పట్లో తెరపడకపోతే ఇది మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. దేశంలో నూనె గింజల ఉత్పత్తి పెంచితే తప్ప ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోలేమని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఇప్పటికే దేశీయ వంట నూనెల అవసరాల్లో 60 శాతం దిగుమతుల ద్వారానే తీర్చుకుంటున్న విషయాన్ని నిపుణులు గుర్తు చేస్తున్నారు. నూనె గింజల పంటలు సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర, దిగుమతుల నుంచి రక్షణ లభిస్తే తప్ప, రైతు దేశంలో నూనె గింజల పంటలు సాగు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపరని నిపుణులు చెబుతున్నారు.

**సబ్బులు, డిటర్జెంట్లపైనా!**

గల్ఫ్ యుద్ధ ప్రభావం సబ్బులు, డిటర్జెంట్ కంపెనీలపైనా కనిపిస్తోంది. ఈ కంపెనీల ప్రధాన ముడి పదార్థాలు, ప్యాకేజింగ్ ధరలు పెరిగిపోయాయి. దీంతో ప్రస్తుత ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఈ కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను 3 నుంచి 4 శాతం వరకు పెంచుతాయని భావిస్తున్నారు. కొన్ని కంపెనీలైతే ధరలు పెంచకుండా గతంలోలా ప్యాకెట్లలోని వస్తువుల పరిమాణాన్ని తగ్గించి నెట్టుకు వచ్చే అవకాశం ఉందని నువామా ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ అనే బ్రోకరేజీ సంస్థ తెలిపింది. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ధరలు పెంచితే, అమ్మకాలు పడిపోతాయనే భయమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

# నిర్మాణ రంగంపై యుద్ధ భారం!

### రంగులు, సిమెంట్, స్టీల్ వస్తువుల ధరల్లో పెరుగుదల
### 30 శాతం దాకా పెరిగిన టైల్స్, శానిటరీ వేర్ రేట్లు
### యూపీవీసీ ధరలపైనా ప్రభావం
### మూతపడిన మోర్బి సిరామిక్ పరిశ్రమ
### పెరిగిపోయిన గృహ నిర్మాణ బడ్జెట్

హైదరాబాద్, ఏప్రిల్ 3 (వార్తా వేదిక సూర్య )



పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధ ప్రభావం క్రమంగా అన్ని రంగాలకు విస్తరిస్తోంది. ముడి చమురు, సహజ వాయువు సరఫరాలో ఏర్పడిన అంతరాయం నిర్మాణ రంగాన్ని కూడా కుదేలు చేస్తోంది. గృహ నిర్మాణ సామగ్రి ధరలు ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా రంగులు, స్టీల్, సిమెంట్, ప్లాస్టిక్, శానిటరీ వేర్, టైల్స్ తదితర వస్తువుల ధరలు పది రోజుల వ్యవధిలోనే 20 నుంచి 50 శాతం మేర పెరిగిపోయాయి. దీంతో నిర్మాణ వ్యయం అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయి గృహ నిర్మాణదారులు, బిల్డర్లు హడలెత్తిపోతున్నారు. కాగా, ముడి చమురు సరఫరాలో అంతరాయం రంగుల పరిశ్రమను తీవ్రంగా ప్రభావితం చేసింది. రంగుల తయారీకి వినియోగించే ముడిసరుకుల్లో ముడి చమురు అత్యంత ముఖ్యమైనది కావడమే ఇందుకు కారణం. గల్ఫ్ దేశాల నుంచి చమురు సరఫరా తగ్గడంతో రంగుల తయారీ భారంగా మారిందని ఆ రంగానికి చెందిన వారు వాపోతున్నారు. రంగు గోడకు అతుక్కుపోయేలా చేయడంలో బైండర్లు(రెజిన్స్) అత్యంత ముఖ్యమైనవి. యాక్రిలిక్, ఎపోక్సి, పాలీయురేతిన్ వంటి రసాయనాలతో ఈ బైండర్లను తయారు చేస్తారు. రంగునిచ్చే పదార్థంలో కీలకమైనది పిగ్మెంట్.. ఇందులో టైటానియం డయాక్సైడ్. తెలుపు రంగు కోసం వాడే అత్యంత ముఖ్యమైన రసాయనం. అలాగే, ఐరన్ ఆక్సైడ్‌ను ఎరుపు, పసుపు, గోధుమ రంగుల కోసం వినియోగిస్తారు. జింక్ ఆక్సైడ్.. రంగు పాడవకుండా వాడతారు. తయారైన రంగులు ద్రవ రూపంలో ఉండేందుకు వాడే సాల్వెంట్‌లను గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. గోడలకు బూజు పట్టకుండా చేసే యాంటీ ఫంగల్ ఏజెంట్స్, గోడకు వేసిన రంగు త్వరగా ఆరిపోయేలా చేసే డ్రైయర్స్, రంగు చిక్కదనం కోసం వాడే థిక్‌నర్స్ వంటి వాటిల్లో పెట్రోలియం అనుబంధ రసాయనాల నుంచి తయారు చేసేవి 70 శాతం ఉన్నాయి. ఆయా రసాయనాల ధరలు పెరగడంతో రంగుల ధరలను కూడా పెంచేస్తున్నారు. మినరల్ టర్పెంటన్ ఆయిల్ లీటరు గతంలో రూ.90 ఉంటే ప్రస్తుతం రూ.135 వరకు విక్రయిస్తున్నారు. సాధారణంగా వినియోగించే రంగుల ధరలు కూడా 15 నుంచి 20 శాతం దాకా పెరిగాయి. ఇక, ప్లంబింగ్‌కు సంబంధించి పీవీసీ పైపులు, ఇతరత్రా వస్తువుల ధరలు కూడా 30 శాతం దాకా పెరిగాయి.

**యూపీవీసీ ధరలపైనా ప్రభావం**

యూపీవీసీ ధరలు కూడా 10 శాతం దాకా పెరిగాయి. పెట్రోలియం ఉత్పత్తుల నుంచే వచ్చే పీవీసీ రెసిన్‌ను యూపీవీసీ తయారీకి ముడిసరుకుగా ఉపయోగిస్తారు. యుద్ధం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగాయి. ఫలితంగా రెసిన్ ధరలు కూడా పెరిగాయని తయారీదారులు చెబుతున్నారు. ఇక, దేశ అవసరాలకు కావాల్సిన పీవీసీ కోసం ఎక్కువగా ఇతర దేశాల మీద ఆధారపడే పరిస్థితి ఉందని, దీంతో దిగుమతి చేసుకునే యూపీవీసీ కిటికీలు, తలుపులు వంటి వాటి ధరలను కూడా పెంచారని విక్రేతలు చెబుతున్నారు. విండో ఫ్రేమ్ కోసం వినియోగించే అల్యూమినియం, గ్లాస్ ప్యానల్స్ ధరలు కూడా పెరిగాయి. కాగా, రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కువగా ఉండే హైదరాబాద్ లాంటి చోట్ల ఈ ధరల పెరుగుదల వల్ల ప్రాజెక్టు బడ్జెట్ 10 నుంచి 15 శాతం వరకు పెరిగినట్లు బిల్డర్లు వాపోతున్నారు.

**బోసిపోయిన మోర్బి**

భారతదేశ సిరామిక్ రాజధాని అయిన గుజరాత్‌లోని మోర్బి పారిశ్రామిక నగరం పశ్చిమాసియాలోని పరిస్థితుల వల్ల కొద్ది రోజులుగా వెలవెలబోతోంది. దేశ వ్యాప్తంగా వినియోగించే సిరామిక్ ఉత్పత్తుల్లో 90 శాతం మోర్బిలోని పరిశ్రమల్లోనే తయారవుతాయి. మోర్బిలో ఉత్పత్తయ్యే టైల్స్ 150 దేశాలకు ఎగుమతి అవుతాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ మోర్బి టైల్స్ అమ్మకాలే అధికంగా ఉంటాయి. చైనా తర్వాత రెండో అతిపెద్ద సిరామిక్ క్లస్టర్ మోర్బిలోనే ఉంది. వీటితోపాటు గడియారాల తయారీకి ఈ ప్రాంతం ప్రసిద్ధి. టైల్స్ ప్యాకేజీకి అవసరమైన కోరగేటెడ్ బాక్సుల తయారీ పరిశ్రమలు అధికంగానే ఉన్నాయి. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరత వల్ల సిరామిక్ పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో పడిపోయింది. 800కుపైగా సిరామిక్ పరిశ్రమలు ఉన్న మోర్బిలో టైల్స్ తయారీకి అవసరమైన సహజ వాయువు లభ్యం కాకపోవడంతో సుమారు 450కిపైగా పరిశ్రమలు మూతపడ్డాయి. హోర్మోజ్ జలసంధి వద్ద నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ప్రొపేన్ గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. దీంతో మోర్బిలో ప్రొపేన్ గ్యాస్‌పై ఆధారపడిన 250కి పైగా పరిశ్రమలు మూతపడ్డాయి. మోర్బిలోని పరిశ్రమల్లో రోజుకు సగటున 55 లక్షల క్యూబిక్ మీటర్ల ప్రొపేన్ గ్యాస్‌ను వినియోగిస్తారు.

సుమారు 500 యూనిట్లు దీనిపై ఆధారపడి పని చేస్తాయి. పైపులైన్ ద్వారా వచ్చే సహజవాయువు రోజూ సుమారు 25 లక్షల క్యూబిక్ మీటర్ల వినియోగం ఉంటుంది. పరిశ్రమ సజావుగా సాగాలంటే రోజుకు సుమారు 80 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ అవసరమని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. పరిస్థితి తీవ్రతను అధిగమించేందుకు మోర్బి సిరామిక్ తయారీదారుల సంఘం ఏప్రిల్ 15 వరకు పరిశ్రమలను మూసివేయాలని నిర్ణయించింది. మోర్బిలోని సిరామిక్ పరిశ్రమపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు పది లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. వీరిలో 70 శాతం మంది బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారే ఉంటారు. ప్రస్తుతం పనులు లేకపోవడంతో ఆయా కార్మికులంతా స్వగ్రామాలకు వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లోనూ సిరామిక్ వ్యాపారులు, డీలర్లు ఇప్పటికే తమ వద్ద ఉన్న స్టాక్ ధరలు పెంచి విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**స్టీల్ నుంచి సిమెంట్ వరకు..**

నిర్మాణ రంగంలో కీలకమైన స్టీల్ ధరలు టన్నుకు 18 శాతం దాకా పెరిగాయి. కొన్ని బ్రాండెడ్ స్టీల్ సంస్థలు టన్ను ధరను 25 శాతం దాకా పెంచాయనే ప్రచారం జరుగుతోంది. ఇక, సిమెంట్ ధరలు బస్తాకు రూ.50 వరకు పెంచారు. మరోపక్క, టైల్స్, శానిటరీ వేర్స్ తయారీకి వాడే ప్రొపేన్ గ్యాస్ సరఫరా తగ్గడంతో శానిటరీ వేర్ ధరలు రకాన్ని బట్టి 8 నుంచి 12 శాతం వరకు పెరిగాయని చెబుతున్నారు. సిమెంట్‌తోపాటు ఇసుక, ఇటుక ధరలు కూడా పెంచారు. వాహనాలకు డీజిల్, పెట్రోల్ దొరకడం లేదనే సాకుతో రవాణాచార్జీల రూపంలో అదనపు భారాన్ని మోపుతున్నారు. మొన్నటి వరకు రూ.8 ఉన్న ఇటుక ప్రస్తుతం రూ.10 నుంచి రూ.12 దాకా విక్రయిస్తున్నారని చెబుతున్నారు.



# ఇంత బంగారం ఎలా కొన్నావ్ చెప్పు?

### 900 గ్రాముల బంగారు ఆభరణాలు సీజ్

రాయదుర్గం, ఏప్రిల్ 3(వార్తా వేదిక సూర్య ):

చూసినోళ్లు ఆశ్చర్యపోయేలా బంగారు ఆభరణాలు ధరించి టీవీలు, సోషల్ మీడియాలో హడావుడి చేస్తోన్న ఓ వ్యక్తికి ఆదాయపు పన్ను(ఐటీ) శాఖ అధికారులు షాకిచ్చారు. అతని వద్ద సుమారు 900 గ్రాముల బంగారాన్ని సీజ్ చేసి.. ఆ బంగారానికి లెక్కలు చెప్పమంటూ నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతానికి చెందిన గోల్డ్‌మ్యాన్ యాదగిరి అలియాస్ చిన్న పహిల్వాన్ అలియాస్ చిన్న గౌడ్.. బంగారు ఆభరణాలు ధరించి ఇటీవల టీవీలు, సోషల్ మీడియాలో ఇంటర్వ్యూలు ఇస్తున్నాడు. ఈ నేపథ్యంలో చిన్న గౌడ్‌పై ఐటీ అధికారులు దృష్టి సారించారు. అతని వద్ద బంగారాన్ని స్వాధీనం చేసుకొని, ఆ బంగారం కొనుగోలుకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని నోటీసులు ఇచ్చారు. చిన్నగౌడ్ ఐటీ శాఖ అధికారులకు తన ఆదాయం రూ.4లక్షలుగా చూపించడం గమనార్హం. అయితే, అధికారులు సీజ్ చేసిన కొంత బంగారానికి తన వద్ద రశీదులు ఉన్నాయని, మరికొంత బంగారం తమ పెద్దల నుంచి వచ్చిందని చిన్నగౌడ్ చెబుతున్నారు. ఐటీ అధికారులు అడిగిన ఆధారాలు సమర్పిస్తానని పేర్కొన్నారు.

# ట్రేడింగ్.. టాస్క్‌ల పేరిట బురిడీ

### ఒక్కరోజే సైబర్ క్రైం ఠాణాలో 6 కేసులు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (వార్తా వేదిక సూర్య )

స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలొస్తాయి.. ట్రేడింగ్‌లో శిక్షణ ఇస్తామని అమాయకులను నమ్మించి.. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, నకిలీ ట్రేడింగ్ ట్రైనింగ్ గ్రూపులు, నకిలీ ఫారెక్స్ ట్రేడింగ్ సంస్థల పేరిట, ఉద్యోగావకాశాల పేరిట సైబర్ నేరగాళ్లు.. రూ.కోట్లు స్వాహా చేస్తున్నారు. అలా రూ.1.49 కోట్లు కాజేశారని ఒక్కరోజే సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఆరు ఫిర్యాదులు నమోదయ్యాయి. వారిని నమ్మించడానికి మధ్యలో కొంత ఉపసంహరణకు అనుమతిస్తున్నారు. అటుపై మొత్తం విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నిస్తే వారి ఖాతా తొలగించినట్లు, పన్ను చెల్లించాలంటూ, మరింత పెట్టుబడి పెట్టాలంటూ సందేశాలు వస్తాయి.

ట్రేడింగ్ శిక్షణ అంటూ 60.50 లక్షల మోసం

కూకట్‌పల్లికి చెందిన ఐటీ ఉద్యోగిని 'జీ7 ఫ్రీ స్టాక్ లర్నింగ్ అండ్ డిస్కషన్' అనే వాట్సాప్ గ్రూపులో చేర్పించి.. స్టాక్స్ ట్రేడింగ్‌లో శిక్షణ పేర రూ.60.50 లక్షలు పెట్టుబడి పెట్టించారు. మధ్యలో రూ.10 వేలు విజయవంతంగా ఉపసంహరించడంతో నమ్మకం పెరిగింది. 'రాజ్‌పుతాన్ స్టెయిన్‌లెస్ స్టీల్' అనే సంస్థ ఐపీఓలో సుమారు రూ.87 లక్షల విలువైన 60 వేల షేర్లు కేటాయించామని నమ్మించినా.. రూ.2 కోట్ల లాభం చూపినా, వాటి ఉపసంహరణకు అనుమతించలేదు.

# ప్రొ. జయశంకర్ సిద్ధాంతాల ప్రకారం పని చేస్తాం

### పార్టీ ఆవిర్భావం తర్వాత భారీగా చేరికలుంటాయి
### సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలు మహిళలకు రిజర్వు అయితే వాటిలో ఒక దాన్నుంచి పోటీ చేస్తా
### నిద్రావస్థలో బీఆర్ఎస్.. ప్రథమ శత్రువు కాంగ్రెస్సే
### ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని ప్రభుత్వం అడ్డుకోవటం లేదు
### ప్రైవేటు టీచర్ల హక్కుల కోసం పోరాడుతాం: కవిత



హైదరాబాద్, ఏప్రిల్ 3 (వార్తా వేదిక సూర్య )

తాను స్థాపించనున్న పార్టీకి పాత పేరు, కొత్త అజెండా ఉంటుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఖాళీగా ఉందని.. దాన్ని ఎవరైనా వాడుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఒక టీమ్ పని చేస్తోందని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో మీడియాతో కవిత ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త ఎవరూ లేరంటూ.. ఎన్నికల వ్యూహాకర్త ప్రశాంత్ కిశోర్‌తో ఒప్పందాలు చేసుకునే పార్టీలపై పరోక్షంగా చెణుకులు విసిరారు. ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల ప్రకారం తమ పార్టీ నడుస్తుందన్నారు. ఆవిర్భావ సభకు ఇతర పార్టీల నేతలను ఆహ్వానించడం లేదని, వేదికపైనే తమ అజెండా చెబుతామని, యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని కవిత వెల్లడించారు. ఎజెండా తెలియజేసిన తర్వాత పెద్దఎత్తున చేరికలు ఉంటాయని, విదేశాల్లో ఉంటున్న తెలంగాణ బిడ్డలు కూడా పార్టీలో చేరతామంటున్నారని తెలిపారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ తమకు గొప్ప అవకాశమని చెబుతూ.. సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలు మహిళలకు రిజర్వు అయితే వాటిలో ఒకదాన్నించి పోటీ చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ నిద్రావస్థలో ఉందని, తమకు ప్రథమ శత్రువు కాంగ్రెస్సేనని.. తమ పోరాటం ఆ పార్టీపైనే ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను ఆగం చేయాలని చూస్తున్నారని, అసలు సిటీని చంపకుంటే చాలని కవిత అన్నారు. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారంచేసి ఆ పార్టీని ఓడించారని.. ప్రస్తుతం కేరళలో ప్రచారం చేస్తున్నారని, అక్కడా కాంగ్రెస్‌ను ఓడిస్తారని ఎద్దేవా చేశారు. అమరావతి బిల్లు సందర్భంగా భద్రాచలం ఐదు గ్రామాల గురించి పార్లమెంటులో తెలంగాణ ఎంపీలు ప్రస్తావించాల్సి ఉండాల్సిందని, కానీ వారు పట్టించుకోలేదన్నారు.

ఫీజుల పేరిట ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీ

ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల నియంత్రణలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం ఏం చర్యలు తీసుకున్నారని కవిత ప్రశ్నించారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి ఫీజుల నియంత్రణ చట్టం ఎందుకు తీసుకురాలేదని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విద్యాకమిషన్ అతి చెత్త నివేదిక ఇచ్చిందని.. ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలనే సిఫారసు తప్ప దాంట్లో ఆమోద యోగ్యమైనది మరేదీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో 12 వేల ప్రైవేటు స్కూళ్లలో 38 లక్షలమంది విద్యార్థులు చదువుతున్నారని, యాజమాన్యాలు ఒకేసారి 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచి, దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. తాను బీఆర్ఎస్లో ఉన్నప్పుడు తనను నిజామాబాద్ కే పరిమితం చే సినప్పటికీ.. నారాయణ, చైతన్యలాంటి కార్పొరేట్ సంస్థలు అక్కడికి రాకుండా అడ్డుకున్నానని కవిత తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వేర్వేరు పేర్లతో ఆ సంస్థలు నిజామాబాద్‌కు వచ్చాయన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులు పెంచుతున్న స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రుల జీతాలు పెరగడం లేదని.. 7 శాతం నుంచి 8 శాతం ఫీజు పెంపునకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని సూచించారు. ఏటా భారీగా ఫీజులు పెంచుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు వాటిలో పనిచేస్తున్న టీచర్లు, ఉద్యోగుల జీతాలు మాత్రం పెంచడం లేదన్నారు. కార్పొరేట్, నార్త్‌ఇండియన్ స్కూళ్ల వారు తెలంగాణ వారికి కనీసం ధోబీగా కూడా అవకాశం ఇవ్వడం లేదని, అలాంటి వాటికి పర్మిషన్ ఇవ్వొద్దని కోరారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్ల పరిస్థితి దుర్భరంగా ఉందని, వారి హక్కుల సాధన కోసం పోరాడుతామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఉద్యమిస్తామని కవిత తెలిపారు.

# వెనక్కి మళ్లిన రూ.276 కోట్ల కేంద్ర నిధులు

### ఉన్నతాధికారుల నిష్క్రియే కారణం.. వివరణ కోరిన కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (వార్తా వేదిక సూర్య )

రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల నిష్క్రియ వల్ల.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రం విడుదల చేసిన రూ.276 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. నిర్దేశిత గడువులోపు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు చెల్లించకపోవడ మే ఈ పరిస్థితికి కారణం. దీనిపై కేంద్ర గిరిజనశాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును వివరణ కోరినట్టు తెలిసింది. రాష్ట్ర సర్కారు వివరణతో కేంద్రం సంతృప్తి చెందకపోతే ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల గతేడాది ఫీజు రీయుంబర్స్‌మెంట్ నిధులకు కోత పడుతుంది. కేంద్రం నిధులను నిలిపివేస్తే ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాల్సి వస్తుంది. విషయమేంటంటే.. రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, ఇతర వృత్తివిద్యా కోర్సులు చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రం ప్రతి ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందిస్తుంది. ఈమేరకు 2025-26 విద్యా సంవత్సరానికి రూ. 276 కోట్లు విడుదల చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.69 కోట్లు (25శాతం) మార్చి 31లోపు అందించాల్సి ఉంది. ఈ మేరకు విద్యాశాఖ ప్రభుత్వాన్ని కోరినా.. గడువులోపు సీఎం కార్యాలయం నుంచి స్పందన రాలేదు. దీంతో కేంద్ర నిధులు వెనక్కిమళ్లాయి. కాగా రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. గత నాలుగేళ్లలో బాకీపడ్డ రూ. 7500 కోట్లు ఎలా చెల్లించాలా అని ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. అయినా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం కేంద్రం ఇచ్చిన నిధులను సైతం వినియోగించుకోలేకపోయింది.

## జనసేన ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




**వలిగొండ, ఏప్రిల్ 3 (వార్తా వేదిక సూర్య) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గోపరాజుపల్లి మార్కెట్ యార్డులో శుక్రవారం జనసేన ఆధ్వర్యంలో గ్రామ ఏడవ వార్డు మెంబర్ జననాయకులు మేడి కుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో మార్కెట్ లో పనిచేసే వ్యవసాయ కూలీలు, రైతుల దహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సలిగంజి పృద్వి, గాజుల అంజయ్య, చిల్లర స్వామి యాదవ్, పులగూర్ల లింగారెడ్డి, నలబోలు ధర్మేందర్, రుద్ర పల్లి మత్స్యగిరి, గాజుల వెంకటేశం,పాలకూర్ల ఎల్లయ్య,పాలకూర్ల శ్రీనివాస్, వార్డు మెంబర్ మంటిపల్లి నరేష్, ఎనుగుల సత్తయ్య, యాస యాదిరెడ్డి, కోమటిరెడ్డి మల్లారెడ్డి, మర్రి సైదులు, రైతులు, వ్యవసాయ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూరులో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**మోత్కూరు, ఏప్రిల్ 03 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ పరిధిలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్నట్టువంటి క్రైస్ట్ కల్వరి చర్చిలో పాస్టర్ కాపర్తి సైమన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు కవిత, ఏంజెల్ షీభా, బుచ్చమ్మ, ఉపేంద్ర, వసంత,పద్మ, మణికుమార్, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



**మోత్కూరు, (అడ్డగూడూరు),ఏప్రిల్ 03 (వార్త వేదిక సూర్య):** అడ్డ గూడూరు మండలం వెల్దేవి గ్రామానికి చెందిన వెలిశాల నాగమ్మ ఇటీవల బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ కావడంతో హైదరాబాద్ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి క్రింద 60 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మన గోటి జ్యోజి, స్థానిక సర్పంచ్ రాచకొండ రమేష్ ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

## కైలాస పురం క్షేత్రాన్ని సందర్శించిన కావేరి సీడ్స్ ప్రొడక్షన్స్ ఆఫీసర్



**యాదగిరిగుట్ట ఏప్రిల్ 3 ( వార్త వేదిక సూర్య ) :** యాదగిరిగుట్ట మండలం, కాచారం గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని కావేరీ సీడ్ ప్రొడక్షన్ ఆఫీసర్ మోతే మనోహర్ రెడ్డి సందర్శించి శుక్రవారం వారి తల్లిదండ్రుల పేరు మీద ప్రత్యేక పూజలు చేసి అర్చన చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఐ వి ఎఫ్ రాష్ట్ర ధార్మిక పరిషత్ చైర్మన్ వంగపల్లి అంజయ్య స్వామి, మనోహర్ రెడ్డిని శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఎలేందర్ సునీత, లింగస్వామి, పుష్పలత, వల్లాల ఎలేందర్ అనిత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమంలో వెల్లంకి ఉపాధ్యాయులు





**రామన్నపేట,ఏప్రిల్ 3 (వార్తా వేదిక సూర్య) :** రామన్నపేట మండలం ప్రాథమిక పాఠశాల వెల్లంకి ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం గుడ్ ఫ్రైడే సెలవు అయినప్పటికీ కూడా విద్యార్థులతో కలిసి నిర్వహించడం జరిగింది. ముందుగా బడిబాట కార్యక్రమం యొక్క కరపత్రమును గ్రామ సర్పంచ్ శ్రీమతి ఇడెం రాధా శ్రీనివాస్ మరియు కరపత్ర దాతలు బత్తుల శ్రీనివాస్ ,స్వారాజ చైర్ పర్సన్ శ్రీమతి పులగం సులోచన , పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పల్లె మోహన్ రెడ్డి గారలు సంయుక్తంగా ఆవిష్కరించడం జరిగింది. తదుపరి బడిబాట కార్యక్రమం లో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాల లో వారి పిల్లలను చేర్పించాలని కోరడం జరిగింది. వారి నుండి మంచి స్పందన రావడం జరిగింది. వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీమతి ఈడెం రాధా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విలువైన ఉచిత విద్య లభిస్తుందని తెలియజేయడం జరిగింది అదేవిధంగా ప్రతి తల్లిదండ్రులు ఆలోచించి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాల బలోపేతానికి సహకరించాలని కోరడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇట్టే సోమిరెడ్డి , ఉయ్యాల బిక్షమయ్య , దూదిగామ సువర్ణ , మందుగుల వెంకటయ్య , కొసన మాధవి, నకిరేకంటే అశ్విని పాల్గొనడం జరిగింది.

# తెలంగాణ రైతాంగ, అణగారిన వర్గాల నాయకుడు దొడ్డి కొమరయ్య

▸▸ సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి




**యాదగిరిగుట్ట ఏప్రిల్ 3 (వార్త వేదిక సూర్య ) :** అమరజీవి దొడ్డి కొమరయ్య జయంతిని పురస్కరించుకొని ఈరోజు చిన్న కందుకూరు గ్రామంలో వారి చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానల దామోదర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ అరాచక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగినటువంటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మొట్టమొదటిగా అమరుడైన గొప్ప నాయకుడు దొడ్డి కొమురయ్య అని వారిని స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ రాష్ట్రమంతా కూడా ఉద్యమించి నిజామును తరిమికొట్టిన ఘన చరిత్ర నాటి పోరాట నాయకులదని ఆస్ఫూర్తితోనే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో 3000 గ్రామాలను విముక్తి చేసి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచినటువంటి చరిత్ర అని ఈ సందర్భంగా గుర్తు చేశారు.వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత చెడు మార్గాల్లో నడవకుండా సామాజిక స్పృహతో ముందుకు నడవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య,బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పేర బోయిన పెంటయ్య, చిన్న కందుకూరు ఉపసర్పంచ్ కాటం శ్రీకాంత్, కురుమ సంఘం అధ్యక్షులు కాటం సిద్ధులు, ఉపాధ్యక్షులు రేకల కరుణాకర్, మాజీ సర్పంచ్ సుబ్బూరు నరసయ్య, దయ్యాల లక్ష్మయ్య, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు దొడ్డి సంతోష శ్రీశైలం, నమిలే జైపాల్, రాకల మల్లు స్వామి, గవ్వల సోమయ్య, నమిలే సంజీవ, సుబ్బూరు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ క్రమశిక్షణ అభియాన్ సమావేశాలను విజయవంతం చేయండి



**మోత్కూరు, ఏప్రిల్ 03 (వార్తా వేదిక సూర్య );** ఈనెల 4,5 తేదీలలో మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో భాజపా ఆధ్వర్యంలో జరిగే పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ క్రమశిక్షణ అభియాన్ సమావేశాలను విజయవంతం చేయాలని బిజెపి సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రశిక్షణ జిల్లా కన్వీనర్ వంగవీటి శ్రీనివాసరావు కోరారు.శుక్రవారం పట్టణ భాజపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి భాజపా కార్యకర్తలకు పార్టీ సైధానిక సిద్ధాంతాలు, క్రమశిక్షణ, బూత్ సాయి పార్టీ నిర్మాణం బలోపేతం కావడానికి అనుసరించవలసిన పద్ధతులు తదితర అంశాలపై చర్చించేందుకే ఈ ప్రశిక్షణ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు మోత్కూరు పట్టణ, రూరల్ అడ్డగూడూరు మండలాల కార్యకర్త నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో భాజాపా పట్టణ అధ్యక్షురాలు చాడ మంజులా రెడ్డి, జిల్లా నాయకులు కొనతం నాగార్జున రెడ్డి, గౌరు శ్రీనివాస్, కూరాకుల వెంకన్న, పోచం సోమయ్య, పట్టణ నాయకులు చేకూరి మల్లేశం, కందుకూరి ప్రకాష్, ముత్తినేని తిరుమలేష్ ,ఏశబోయిన రమణ,బద్దం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ విండో మద్యం విందు ఘటనలో ముగ్గురు ఉద్యోగులు సస్పెన్షన్

▸▸ 2 ప్రచురితమైన పిఎసిఎస్ చాంబర్ లో మందు పార్టీ "వార్తా వేదిక సూర్య" వార్తకు జిల్లా స్పందన



**మోత్కూరు, ఏప్రిల్ 03 (వార్తా వేదిక సూర్య ):** మోత్కూరు రైతు సేవా సహకార సంఘంలో ఉద్యోగులు మద్యం సేవిస్తూ విందు చేసుకున్న ఘటనపై జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలో సంబంధిత ముగ్గురిని జిల్లా సహకార అధికారి (డిసిఓ) మురళీకృష్ణ సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే,మార్చి 31న రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో కొంతమంది ఉద్యోగులు మద్యం సేవిస్తూవిందు నిర్వహించారు. ఈ దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. అనంతరం ఆ వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలు పత్రికల్లో పాటు ఈ వార్తను "వార్తా వేదిక సూర్య"లో పిఎసిఎస్ చాంబర్ లో మందు పార్టీ ఏప్రిల్ 2న "ప్రచురితమైంది. ఈ ఘటనపై స్పందించిన జిల్లా కలెక్టర్, సంబంధిత ఉద్యోగులను విచారణ చేపట్టారు. విచారణ కొనసాగింపులో భాగంగా జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ గురువారం రైతు సేవా సహకార సంఘం ను స్వయంగా సందర్శించి సంఘటనపై మరింత వివరాలు సేకరించారు.విచారణలో భాగంగా కార్యాలయంలోని చైర్మన్ చాంబర్లో మద్యం సేవిస్తూ విందు చేసుకున్న నరహరి, శివ, యాకూబ్ అనే ముగ్గురు ఉద్యోగులను బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు తేలడంతో, వారిని తక్షణమే సస్పెండ్ చేసినట్లు డిసిఓ గురువారం రాత్రి విలేఖరులకు తెలిపారు.

## సైబర్ క్రైమ్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



**మోత్కూరు, ఏప్రిల్ 03 (వార్తా వేదిక సూర్య ):** సైబర్ క్రైమ్ లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మోత్కూరు సిఐ సి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ లపై అవగాహన కల్పించారు. వేసవి కాలం కావడంతో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సతీష్ కుమార్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరి నర్సన్న సేవలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**యాదగిరిగుట్ట ఏప్రిల్ 3 (వార్త వేదిక సూర్య ) :** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసిం హస్వామి వారిని శుక్రవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వయంభు నారసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం చేయగా ఈవో భవాని శంకర్ స్వామివారి లడ్డు ప్రసాదం, స్వామి వారి ఫోటోను బహుకరించారు.

8 సినిమా INEMA

యాదాద్రి భువనగిరి సంపుటి : 1 సంచిక : 308

వార్త వేదిక సూర్య

యాదాద్రి భువనగిరి శనివారం, ఏప్రిల్ 4, 2026


# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రతి ఇంటింటికి సిపిఐ

**యాదగిరిగుట్ట ఏప్రిల్ 3 (వార్త వేదిక సూర్య )** :గ్రామాలలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏప్రిల్ 1 నుండి 10 వరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి,సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోదా శ్రీరాములు అన్నారు. యాదగిరిగుట్ట మండలం మర్రిగూడెం గ్రామంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని దేశాన్ని మతోన్మాద కార్పొరేట్ కబంధ హస్తాల నుండి విముక్తి చేసి సమసమాజ స్థాపనకై రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని అన్నారు.ప్రస్తుతశీ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ రైతుల హక్కులను కాలరాసే విధంగా 3 రైతు చట్టాలను తీసుకొచ్చిందని అదేవిధంగా కార్మిక హక్కులను హరించే 4 కార్మిక చట్టాలను తీసుకొచ్చి కార్మికుల నడ్డి విరిచే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమం ద్వారా గ్రామాలలో ప్రజల నుండి సమస్యలను తెలుసుకుని ఆ సమస్యల పరిష్కారానికి పోరాటాలను నిర్వహిస్తామని తెలిపారు ఈ ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా కార్మికులు, వ్యాపారులు,ఉద్యోగస్తులు రైతులు,అన్ని వర్గాల ప్రజలు పోరాటాల పార్టీకి నిధి సేకరణ కార్యక్రమానికి చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మారెడ్డి గూడెం సర్పంచ్ కొల్లూరి రాజయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ నెంబర్ పేరబోయిన పెంటయ్య, మర్రిగూడెం సర్పంచ్ బోదాసు స్వప్న జగన్, నాతకాని కిష్టమ్మ, లక్ష్మి, గడ్డం యాదమ్మ, నాటకాని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

**మహేశ్వరంలో ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు**

**మహేశ్వరం ఏప్రిల్ 3 (వార్త వేదిక సూర్య)** మహేశ్వరం మండల కేంద్రంలోని కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు, ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భూమికోసం బుక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజలస్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పికణిక మన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలిఅమరుడు దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలను నిర్వహించిన మహేశ్వరం కురుమ సంఘం నాయకులు,ఈ కార్యక్రమంలో సర్పంచ్ నవీన్, బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు కరొళ్ల చంద్రయ్య ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, ఉపసర్పంచ్ జోరల రమేష్,కురుమ సంఘం అధ్యక్షులు పోల్కం బాలయ్య, పోల్కం కిష్టయ్య పిఎసిఎస్ డైరెక్టర్ కాడమోని ప్రభాకర్, వార్డు సభ్యులు,అకుల విరిబాబు,

మిద్దింటి బాలరాజ్, బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికల మహేందర్, మిద్దింటి యాదగిరి, కరొళ్ల రాములు ముదిరాజ్, సుభాష్, జోరల శ్రీశైలం,హనుమంతు నాయక్, కటికల పరమేష్, మీదింటి ప్రభాకర్, ముచ్చంతల శ్రీను, ఆదిబాబా, మీదింటి సురేష్, పోల్కం మహేందర్, కటికల శంకర్,దయానంద్ గౌడ్, పోల్కం రవి, దేశముఖ సంజయ్, పోల్కం మల్లేష్, పేల రవి, ఒగ్గు శంకర్, మీదింటి సిద్దు, పుట్లగారి చందు, రాఘవేందర్, హరికృష్ణ,ముచ్చంతల మహేందర్,మహేష్ బాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు,



# నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

**రామన్నపేట,ఏప్రిల్ 3 (వార్తా వేదిక సూర్య) :** రామన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గ సాధనకు సంబంధించిన వాల్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగిందని రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర రమేష్ గౌడ్ లు ఒక ప్రకటనలో అన్నారు... ఈ సందర్భంగా బొడ్డుపల్లి లింగయ్య ,ఎర్ర రమేష్ గౌడ్ లు మాట్లాడుతూ నియోజకవర్గ సాధన కోసం సాధన సమితి కమిటీ మరియు వివిధ పార్టీల నాయకులు హాజరై విజయవంతం చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు, అనంతరం మాట్లాడుతూ రామన్నపేట నియోజకవర్గంగా ఏర్పడాలని రామన్నపేట ప్రజాప్రతినిధులకు నాయకులకు వివిధ పార్టీల అందరికీ ఉందని, కొందరికి టైం ఉండి రాలేకపోయారని, కొందరు మనస్పూర్తిగా కోరుకున్నారని, ఏది ఏమైనా ఒక ప్రణాళికతో నియోజకవర్గ సాధన సమితి ముందుకు పోతుందని అని పార్టీల నాయకులు సాధన సమితి కలిసి ముందుకు పోతుందని ఎంపీలను కేంద్ర మంత్రులను కలవడానికి ప్రజాక్షేత్రంలో పెద్ద ఎత్తున నిరాహార దీక్ష , ర్యాలీ చేయడానికి ఇంకా వివిధ కార్యక్రమాలతో నియోజకవర్గం సాధించడానికి సాధన సమితి వెనకడుగు వేయకుండా ముందుకు సాగుతుందని ఈ అవకాశాన్ని అందరూ గుర్తించి సోషల్ మీడియా ద్వారా ఇతర ప్రత్యామ్నాయ అవకాశాల ద్వారా సహకరించుటకు ముందు ఉంటారని ఆశిస్తున్నామని అన్నారు... వాల్ పోస్టర్ ఆవిష్కరించిన వారిలో పోచబోయిన మల్లేశం, పోతరాజు శంకరయ్య, వర్కాల గోపాల్, నకరికంటి అశోక్, సాల్వేరు అశోక్, ఎస్ కె చాంద్, గడ్డం యాదగిరి, ఎండి ఫజల్, కూనూరు కృష్ణ, జెట్టి శివప్రసాద్, గొలుసుల ప్రసాద్, గంగాపురం యాదయ్య, కూనూరు శ్రీనివాస్, పున్న వెంకటేశం, సంగిశెట్టి సుదర్శన్, రేఖ యాదయ్య , రచ్చ యాదగిరి,దండుగుల రాములు నకిరెకంటి నరేష్, నకిరెకంటి నరేందర్, బాలగోని గణేష్, ఎర్ర బిక్షపతి, బాలగోని మల్లయ్య, ఎర్ర నర్సయ్య, పెండెం రవీందర్ రామోజీ నరసింహా చారి, కోట సుధాకర్, ఇమామ్, తదితరులు పాల్గొన్నారు..



# మహాత్మాజ్యోతి భాపూలే బి.సి గురుకులం సిబ్బంది మానవతా స్ఫూర్తి






**మహేశ్వరం ఏప్రిల్ 3 (వార్త వేదిక సూర్య):** మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలోని బైరాగి గూడ గ్రామం లో ఉన్న ప్రభుత్వ ఎం.జె.పి టి.బి.సి గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మెగావత్ శివ (15) కు కొత్త జీవితం లభించింది.కొద్ది కాలంగా గుండెలో రంధ్రం సమస్యతో మెగావత్ శివ బాధపడుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన శివ ఆరోగ్య సమస్యను గుర్తించిన పాఠశాల ప్రిన్సిపాల్ పి. దీప, హౌస్ మాస్టర్ నవీన్ కుమార్, స్టాఫ్ నర్స్ గండికోట సరిత, అబూ బకర్ అస్మా విద్యార్థి తల్లిదండ్రుల ఆమోదం తీసుకుని ఆర్.బి.ఎస్.కె వారి సహకారంతో విద్యార్థికి వైద్య పరీక్షలు చేయించారు. తదుపరి ఆర్.వి.ఎస్.కే వారి ఆధ్వర్యంలో 2026 మార్చి 30న హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని అపోలో ఆసుపత్రిలో నిపుణుల బృందం శస్త్రచికిత్స చేపట్టి విజయవంతంగా పూర్తి చేసింది. ఆర్.బి.ఎస్.కే ఆధ్వర్యంలో పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించబడింది. విద్యార్థి శివ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు తెలిపారు. ప్రిన్సిపాల్ దీప, మాట్లాడుతూ, “పిల్లల ఆరోగ్యం మా బాధ్యత. శివ శస్త్రచికిత్స విజయవంతం కావటం పాఠశాల మొత్తానికి గర్వకారణం” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లోహౌస్ మాస్టర్ నవీన్ కుమార్, స్టాఫ్ నర్స్ గండికోట సరిత మరియు అబూ బకర్ అస్మా శస్త్రచికిత్స ప్రక్రియ మొత్తం మీద శివ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పటంలోనూ, ఆర్.బి.ఎస్.కే విభాగంతో సమన్వయం చేయటంలోనూ కీలక పాత్ర పోషించారు.

# ఘనంగా ఆండాళ్ అమ్మవారి ఉంజల్ సేవ

**స్వామివారి నిత్య రాబడి రూ.23.99 లక్షలు...**



**యాదగిరిగుట్ట ఏప్రిల్ 3 ( వార్త వేదిక సూర్య ) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో ఆండాళ్ అమ్మవారికి ఉంజల్ సేవ ఆలయ అర్చకులు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఉదయం అభిషేకం, సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఉంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉంజల్ సేవను ఆలయ పురవీధులలో ఊరేగించి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారి ఆలయ నిత్య రాబడి లో భాగంగా శుక్రవారం రోజున రూ.23,99,920, ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి పవన్ కుమార్ శర్మ, శ్రీనాథ్ చార్యులు, కాండూరి వెంకటాచార్యులు, నరేష్ కుమార్ చార్యులు, అనిల్ కుమార్ చార్యులు, వినయ్ కుమార్ చార్యులు, సూపరిండెంట్ సురేందర్ రెడ్డి, ఇన్చార్జి వెంకటేష్,కొమ్మ గాని కుమార్,ఎస్పీఎఫ్ సిబ్బంది నందు నాయక్,కురుమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిలో పాల్గొన్న కాకి ఈశ్వర్ ముదిరాజ్



**మహేశ్వరం ఏప్రిల్ 3 (వార్త వేదిక సూర్య)** మహేశ్వరం మండల్ కేంద్రంలోని చత్రపతి శివాజీ మహారాజ్ 346 వర్ధంతి సందర్భంగా మహేశ్వరం మండల కేంద్రంలోని తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, నివాళులు అర్పించారు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య, 99వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రెల రాములు ముదిరాజ్, స్వర్ణ గంటి సుభాష్,కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుట్లగారి చందు, హనుమంతు నాయక్, మిద్దింటి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు,










Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**